ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 24 ఆగస్టు 2024



సచివాలయ సిబ్బందిపై..
డీపీవో ఆగ్రహం

పెదపాడు మండలంలో జరిగిన గ్రామ సభల్లో జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజుపేటలో పలువురు సచివాలయ సిబ్బంది యూనిఫాం లేకుండా కన్పించడం, గత ప్రభుత్వ హయాంలోని పథకాల పేర్లనే గ్రామసభల్లో ప్రస్తావించడంతో డీపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

\- పెదపాడు

బిల్లులపై సంతకాలకు
సర్పంచ్ నిరాకరణ

గ్రామ పంచాయతీ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి చేసిన వ్యయానికి బిల్లులు చెల్లించే విషయ మై గ్రామ సర్పంచ్ చెక్‌లపై సంతకాలు పెట్టడానికి నిరాక రించడంతో గ్రామసభ అనంతరం వివాదం రేగింది. ఈ వివాదంలో గ్రామ సర్పంచ్ భర్త, మరొక వ్యక్తి మధ్య తోపులాట జరిగి ఇద్దరు కిందపడడంతో ఒకరు ప్రైవేటు ఆస్పత్రిలో, మరొకరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. దీనికి సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలివి. పెదవేగి మండలం ముండూరులో ఇంతకు ముందు జరిగిన పనులకు సంబంధించి బిల్లులు బకాయి ఉన్నాయి. దీనిపై సర్పంచ్ రాచూరి దేవిని అడిగినా చెక్‌లపై సంతకాలు పెట్టకుండా కాలయాపన చేస్తున్నారు. గ్రామంలో శుక్రవారం గ్రామసభ ముగిసిన అనంతరం అదే గ్రామానికి చెందిన అన్నపనేని సురేష్ సర్పంచ్‌ను నిలదీసినా చెక్‌లపై సంతకాలు పెట్టడానికి నిరాకరించారు. ఈక్రమంలో సర్పంచ్ భర్త రాచూరి బాల స్వామి, సురేష్‌ను ఇద్దరు ఘర్షణ పడి ఒకరినొకరు తోసుకోవడంతో బాల స్వామి కిందపడిపోగా, సురేష్ స్వల్పంగా గాయపడ్డాడు. దీనిపై సర్పంచ్ దేవి, భర్త బాల స్వామితో కలిసి రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బాలస్వామిని ఏలూ రులో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. సురేష్‌ను జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. దీనిపై పెదవేగి ఎస్‌ఐ వి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ గ్రామసభ అనంతరం బిల్లుల విషయమై సర్పంచ్ భర్త బాలస్వామి, అదే గ్రామానికి చెందిన సురేష్ మధ్య వాగ్వాదం జరిగి నట్టు తెలిసిందని, ఇద్దరూ ఆస్పత్రిలో చేరారని, పూర్తి సమాచారం ఇంకా అందలేదని, ఇద్దరి ఫిర్యాదులు అందిన తర్వాత చర్యలు చేపడతామన్నారు.

\- పెదవేగి

స్వర్ణ గ్రామాలే.. ధ్యేయంగా!

547 పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణ



నూజివీడు మండలం బోర్వంచ గ్రామసభలో ప్రసంగిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

- గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన
- ఇకపై ఉపాధి హామీ పథకం కీలక పాత్ర
- గ్రామ సభల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- జిల్లాలో రూ.223 కోట్లతో గ్రామాభివృద్ధి పనులు

స్వర్ణ గ్రామాల సాధనలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషించనుంది. గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు రూపొందించుకుని వాటికి సంబంధించి ప్రణాళిక రూపకల్పనకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజున గ్రామ సభలు నిర్వహించారు. జిల్లాలోని 547 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్న 87 రకాల పనుల్లో ఆయా గ్రామాలకు అవసరమైన పనులను ఈ గ్రామ సభల్లో గ్రామస్థుల సమక్షంలో గుర్తించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఉపాధి హామీ యాప్‌లో వాటిని పొందుపరిచారు.

ఏలూరు సిటీ, ఆగస్టు 23 : గ్రామ సభల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పండ్లతోటల పెంపకం, భూగర్భ జలాల పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పెంపకం, పశుసంరక్షణలో భాగంగా షెడ్లు ఏర్పాటు, పశుగ్రాస పెంపకం వంటి పనులతో పాటు అభివృద్ధి పనుల్లో భాగంగా వివిధ భవనాల నిర్మాణం, సీసీ రహదారులు, డ్రెయిన్లు, పంత రహదారులు, చెరువుల పూడికతీత వంటి అనేక కార్యక్రమాలను గ్రామ సభల్లో గుర్తించారు. స్వర్ణ గ్రామ పంచాయతీలే ధ్యేయంగా ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రూ. 223 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్‌తో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు నూజివీడు మండలం బోర్వంచ గ్రామ సభలో పాల్గొన్న రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు రానున్న మార్చి 31 నాటికి గ్రామీణ రహదారులు, మురుగునీటి కాల్వ, పంట కాల్వల పూడికతీత పనులు, పండ్లతోటల పెంపకం, పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ళకు షెడ్లు నిర్మాణం వంటి పనులను గ్రామ ప్రజల ఆమోదం ద్వారా చేపట్టడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్టు వివరించారు. ద్వారకా తిరుమలలో జరిగిన గ్రామ సభలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పాల్గొన్నారు. బుట్టాయిగూడెం మండలంతోపాటు వివిధ మండలాల్లో జరిగిన గ్రామ సభల్లో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పాల్గొన్నారు. జిల్లాలోని మిగిలిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయా నియోజకవర్గాల్లోని గ్రామ సభల్లో పాల్గొన్నారు.



ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామసభకు హాజరైన గ్రామస్థులు

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక : కలెక్టర్

చింతలపూడి : గ్రామసభల్లో ప్రజా అవసరాలను గుర్తించి ప్రణాళిక ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ కె.వెట్రి సెల్వి అన్నారు. చింతలపూడి మండలం ప్రగడవరం పంచాయతీలో శుక్రవారం జరిగిన గ్రామసభలో పాల్గొని ఆమె మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు గుర్తింపుకు జిల్లాలోని 547 పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ప్రగడవరం గ్రామాన్ని మోడల్ పంచాయతీగా తీసుకురావడానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ పి.డి రాము మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు ఏడాదిలో 100రోజులు పని కల్పిస్తారని, కుటుంబంలో ఒక్కరికి మాత్రమే జాబ్‌కార్డు ఇస్తారన్నారు. ప్రగడవరం గ్రామసభలో అంతర్గత రోడ్ల కోసం మెటీరియల్ కాంపొండ్ కింద 8 సీసీరోడ్లు, పంట కాలువ పనుల కింద 13 పనులు, పండ్ల తోటలకు ఉపాధి సహకారం ఇవ్వాలని గుర్తించారన్నారు. గ్రామ సచివాలయ ప్రాంగణంలో కలెక్టర్, ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

- ఉపాధి హామీ అధికారులపై మంత్రి పార్థసారథి ఆగ్రహం

ముసునూరు : 'రమణక్కపేటలో గతంలో జరిగిన ఉపాధి పనులపై విచారణ చేయిస్తాం.. అధికారులు అవకతవకలకు పాల్పడినట్టు తేలితే శాఖాపరమైన చర్యలు తప్పవు' అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. ముసునూరు మండలంలోని రమణక్కపేట గ్రామసచివాలయం వద్ద గురువారం నిర్వహించిన ఉపాధి హామీ ప్రత్యేక గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామసభలో ఉపాధి హామీ పథకంలో పనులకు రాని కూలీలకు మస్టర్లు వేయడం, వేతనాల చెల్లింపులు, పనిదినాలు కల్పించడంలో అధికారుల పనితీరుపై కూలీలు మంత్రికి ఫిర్యాదు చేశారు. మంత్రి మాట్లాడుతూ ఈ గ్రామంలో 780 జాబ్‌కార్డులు యాక్టివ్‌లో ఉండగా, పనిదినాలు 35 వేలు మాత్రమే ఉండడం ఏమిటని, ఒక జాబ్‌కార్డుకు 100 రోజులు పనిదినాలు కల్పించాల్సి ఉండగా, ఎందుకు మీరు పూర్తిస్థాయిలో పనికల్పనకు చర్యలు తీసుకోలేదంటూ ఏపీవో రోజ్‌లీల, ఈసీ జయప్రసాద్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇష్టానుసారంగా పనులు కల్పించడం ఏమిటని మండిపడ్డారు. పనికి రాకుండా మస్టర్లు వేయడం, పనిచేసిన వారికి తక్కువ వేతనాలు చెల్లించడం మీ పనితీరుకు అద్దం పడుతోందని అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి పనుల్లో అనేక అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ చేయించాలని స్థానికులు, కూలీలు కోరగా స్పందించిన మంత్రి విచారణకు ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా తాము కృషి చేస్తున్నామన్నారు. గ్రామాల అభివృద్ధికి దోహదం చేసే 87 రకాల పనులను ఉపాధి హామీ కింద చేపట్టుకోవచ్చన్నారు.



నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు



బుట్టాయగూడెంలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, చిత్రంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి, చిత్రంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్



ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామసభలో మాట్లాడుతున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



ఇబ్రహీంపేట ఇసుక డిపోలో ఇసుక అమ్మకాలపై సూచనలు చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి, ఎస్పీ కేపీ శివకిశోర్

ఇసుక కావాలంటే..
వేలిముద్ర తప్పనిసరి

- ఇకపై ఇసుక విక్రయం కట్టుదిట్టం
- ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి
- ఇసుక డిపోలను పరిశీలించిన ఎస్పీ, జేసీ

కుక్కునూరు, ఆగస్టు 23 : ఇసుక డిపోల్లో ఇసుక విక్రయాలు ఇక కట్టుదిట్టం కానుంది. కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట ఇసుక డిపో నుంచి గత నాలుగు రోజులుగా భారీఎత్తున ఇసుక విక్రయాలు జరగడంపై 'ఇసుక రవాణా సక్రమమేనా..?' అనే శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పలు చర్యలు చేపట్టారు. ఇక నుంచి ఎవరికి ఇసుక అవసరమో వారు ఇసుక డిపోల కు సమీపంలో ఉన్న సచివాలయం వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో ఆధార్ నెంబర్ ఎంటర్ చేసి వేలిముద్ర వేసి డబ్బులు చెల్లించి ఇసుక బుకింగ్ చేసుకోవాల్సి ఉంది. అనంతరం ఆ రసీదుతో ఇసుక డిపోకు వెళ్తే ఇసుక విక్రయిస్తారు. కాగా శుక్రవారం ఎస్పీ కేపీ.శివకిశోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి వింజరం, ఇబ్రహీంపేట ఇసుక డిపోలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరపరాదని ఆదేశాలు జారీ చేశారు. ఇబ్రహీంపేట ఇసుక డిపో నుంచి ఇసుక కావాలంటే సమీపంలోని తొండిపాక సచివాలయానికి, వింజరం డిపో అయితే సమీపంలోని వింజరం సచివాలయానికి వెళ్లి ఇసుక బుక్ చేసుకోవాలి. ఇదిలా ఉండగా ఇబ్రహీంపేట ఇసుక డిపో నుంచి గత నాలుగు రోజుల వ్యవధిలో దాదాపు 2 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అమ్మకాలు జరిగి నట్టు తెలుస్తోంది. ఆ ఇసుకను తెలంగాణకు, ఆంధ్రాలోని పలు ప్రాంతాలకు తరలించి బ్లాక్ మార్కెట్‌లో అమ్మబోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు సమయంలో ఆధార్ కార్డులో చూపిన అడ్రస్‌కు ఇసుక చేరిందా.. లేదా అన్న కోణంలో అధికారులు విచారణ జరుపుతు న్నట్టు సమాచారం.

జిల్లాలో జోరుగా వర్షాలు

ఏలూరుసిటీ, ఆగస్టు 23 : నైరుతి రుతుపవనాల ప్రభావం తో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. గడచిన 24 గంటల్లో అత్యధికంగా కామవరపుకోట మండలంలో 31.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 15.2 మి.మీ నమోదైంది. ఉంగుటూరు 28.6, నిడమర్రు 27.2, లింగపాలెం 26.4, పెదవేగి 26.2, ఏలూరు రూరల్ 26.2, ఆగిరిపల్లి 25.8, ఏలూరు అర్బన్ 25.6, నూజివీడు 24.6, కొయ్యలగూడెం 24.2, ముసునూరు 22, భీమడోలు 17.4, దెందులూరు 12.2, ద్వారకా తిరుమల 12, జంగారెడ్డిగూడెం 11.4, వేలేరుపాడు 11, జీలుగుమిల్లి 9.4, చాట్రాయి 8.6, టి.నరసాపురం 8.4, చింతలపూడి 8, పోలవరం 8, కైకలూరు 6.4, కలిదిండి 6.2, పెదపాడు 5.8, మండవల్లి 4.8, బుట్టాయిగూడెం 2.8 మి.మీ నమోదయ్యాయి.

చెయ్యి తడిపితేనే.. ప్లాన్!

- పట్టణ ప్రణాళిక విభాగంలో అంతులేని అవినీతి బాగోతం
- కోట్లకు పడగలెత్తుతున్న సిబ్బంది
- నిబంధనలు పాటిస్తే దరఖాస్తు రిజెక్ట్
- బెంబేలెత్తుతున్న నగరవాసులు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 23 : నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతికి అంతేలేకుండా పోతోంది. చిరు ఉద్యోగులు సైతం కోట్లకు పడగ లెత్తుతున్నారంటే అతిశయోక్తి కాదు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎవరి వాటా వారికి వెళ్లడం వల్ల అవినీతి తార స్థాయికి చేరుకుందని, విషయం తెలిసినా వారంతా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిన్నగాక మొన్న వచ్చిన కొందరు సచివాలయ సిబ్బంది సైతం దర్జాగా లంచాలు తీసుకుంటూ లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రణాళిక విభాగం సిబ్బంది సచివాయ సిబ్బందిని ప్రోత్సహిస్తూ వారి ద్వారా అధిక మొత్తంలో వసూళ్లకు తెరలేపారు.

వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా..

స్థల యాజమానులు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ)లా ద్వారా ప్లాన్‌లు గీయించుకుని సచివాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అలాంటిది సచివాలయ వార్డు ప్లానర్స్ కార్పొరేషన్ కార్యాలయంలోనే ప్లాన్‌లు గీసేస్తున్నారు. ఈ ప్లాన్‌లు కూడా తమ పైఅధికారులు చెప్పిన, వారికి అనుకూలమైన నలుగురైదుగురు ఎల్‌టీపీల లాగిన్‌లలో చేసేసుకుని వార్డు ప్లానర్స్ నుంచి అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)ల వరకు ఎవరి వాటాలు వారు పంచుకోవడమే కాకుండా కొంత మొత్తాన్ని నగర పాలక సంస్థకు చెందిన ఓ ఉన్నతాధికారికి, కొందరు ప్రజా ప్రతినిధులకు చేరవేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్లలో తమ ఇష్టారాజ్యంగా ఆ నాలుగు, ఐదు ఎల్‌టీపీ లాగిన్‌లలోనే అప్రూవల్ పొందిన ప్లాన్‌లు వేల సంఖ్యలో ఉన్నాయంటే ఎంత సిండికేట్ నడిచిందో అర్థం చేసుకోవచ్చు. గత ఐదేళ్లలో జగన్ మానసపుత్రిక అయిన సచివాలయాల సిబ్బంది చెలరేగిపోయారు. వారిని అడిగే నాథుడే లేకుండా పోయాడు. గత ఐదేళ్లలో సచివాలయ వార్డు ప్లానర్స్ ఐదుగురిని ప్రణాళిక విభాగంలోకి తీసుకున్నారు. వారికి ఇటీవల టౌన్ ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్లుగా ప్రమోషన్లు ఇచ్చారు. ఈ అధికారంతో వారు చెలరేగిపోయి దర్జాగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఏడు విలీన గ్రామాల్లో లేఅవుట్లన్నీ దాదాపు అక్రమ లేఅవుట్లే. వాటిని డీటీసీపీ నుంచి అప్రూవల్ తీసు కోవడానికి ప్రభుత్వానికి బెటర్‌మెంట్ ఛార్జిస్ రిజిస్ట్రేషన్ వాల్యూపై 14 శాతం యాజమాని కట్టాలి. అయితే స్థల యాజమానులను వార్డు ప్లానర్స్ తప్పు దోవ పట్టించి ఆ మొత్తాన్ని ప్రభుత్వానికి కట్టకుండా చేసి ఆ మొత్తాన్ని తమ జేబులో వేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో డీటీసీపీ నుంచి అప్రూ వల్ అయిన లేఅవుట్లను ఆన్‌లైన్‌లో పెట్టకుండా ఆ నెంబర్లనే కొత్తవాటికి వినియోగించి ప్రభుత్వానికి బెటర్ మెంట్ ఛార్జీలు కట్టకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇలా ఏడు విలీన గ్రామాల అక్రమ లేఅవుట్లను క్రమ బద్ధీకరించడానికి గత ఐదేళ్లలో కోట్లాది రూపాయలను బొక్కేశారు. ఈ విషయమై గతంలో మునిసిపల్ డైరెక్టర్‌కు ఎన్నో ఫిర్యాదులు వెళ్లినా విచారణ పేరుతో ఏళ్ల తరబడి కాలయాపన చేస్తూ చర్యలు తీసుకోకుండా చేస్తున్నారు.

నిబంధనలు పాటిస్తే..తిరస్కరణ!

కొంత మంది యాజమానులు ఎల్‌టీపీల ద్వారా ప్లాన్‌లు వేయించుకుని ఆన్‌లైన్ చేసి పట్టణ ప్రణాళిక విభాగానికి అనుమతి కోసం వెళ్తుంటే రకరకాల ఇబ్బందులు పెట్టి రకరకాల కారణాలు చూపి ఆ ప్లాన్‌లు రిజెక్ట్ చేస్తున్నారు. మరలా వార్డు ప్లానర్స్ ప్లాన్‌లు గీసి వాటిని అప్రూవల్ చేయించి అధిక మొత్తంలో వసూళ్లు చేయడంతో ఎల్‌టీపీలంతా లబోదిబోమంటున్నారు. గత ఐదేళ్లలో సుమారు 60, 70 మంది ఎల్‌టీపీల నోట్లో మన్నుకొట్టారు. డీటీసీపీ అప్రూవల్ వచ్చినవి సుమారు 200 లేఅవుట్ల పర్మిషన్‌లను ఆన్‌లైన్‌లో పెట్టలేదు. మరలా కొత్తగా వచ్చిన లేఅవుట్లను అప్రూవల్ అయిన నెంబర్లతోనే అపరాధ రుసుం తగ్గించి తీసుకుంటూ కార్పొరేషన్ ఆదాయానికి గండికొడుతున్నారు. వ్యక్తిగత ఇళ్లు నిర్మించుకునే వారికి 200 గజాల్లో ప్లాన్ అప్రూవల్ చేయాలంటే రూ.లక్ష, 300 గజాలు దాటితే రూ.2 లక్షలకు పైగా పైనే లంచం ఇవ్వాల్సి వస్తోందంటూ యాజమానులు వాపోతున్నారు. స్థల యాజమానులను ఏదో వంక పెట్టి భయపెట్టి పర్మిషన్ ఇవ్వమంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారనే విమర్శలున్నాయి.

ఆదివారపుపేట మార్కెట్ పక్కనే ఓ మూడు అంతస్తుల జీప్లస్ 3 బిల్డింగ్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు. ఈ బిల్డింగ్ అనుమతి కోసం ఆ ఏరియాలో టౌన్ ప్లానింగ్ అధికారి లక్షలాది రూపాయలు జేబులో వేసుకున్నట్టు ప్రణాళిక విభాగం సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. లోబ్రిడ్జ్ నుంచి వసంత మహల్‌కు వెళ్లే దారిలో కమర్షియల్ కాంప్లెక్స్‌ను 200 గజాల్లో నిర్మించారు. రూ.లక్షలు వసూలు చేసి ఆ కాంప్లెక్స్‌కు నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ పర్మిషన్ ఇచ్చారు. వాస్తవానికి 750 స్వేర్ మీటర్ల స్థలంలో భవనం నిర్మిస్తేనే సెల్లార్‌కు పర్మిషన్ ఇవ్వాలి. అలాంటిది కేవలం 200 గజాల్లో నిర్మించిన వాణిజ్య భవనానికి సెల్లార్ పర్మిషన్ ఇవ్వడం గమనార్హం. స్థల యజమానులంతా లంచాలు భరించలేని స్థితిలో ఉన్నామంటూ ఒక పక్క గగ్గోలు పెడుతుంటే కంచే చేను మేసిందన్న చందానా ఇక్కడ ఎటువంటి లంచాలు కానీ అవినీతి కానీ జరగడం లేదని పట్టణ ప్రణాళిక విభాగాధిపతి చెప్పడం విడ్డూరంగా ఉంది. టౌన్ ప్లానింగ్‌లో ఎటువంటి అవినీతికి తావులేదని, అంతా ప్రభుత్వ రూల్స్ ప్రకారమే పర్మిషన్లు ఇస్తున్నామని అసిస్టెంట్ సిటీ ప్లానర్ చెబుతున్నారు.



ఆదివారపుపేటలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం

వసంత మహల్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ పర్మిషన్ ఇచ్చిన వాణిజ్య సముదాయం

టీచింగ్ X నాన్ టీచింగ్ స్టాఫ్

- ట్రిపుల్ ఐటీలో రగడ.. పోలీసు స్టేషన్ వరకు వివాదం

నూజివీడు టౌన్, ఆగస్టు 23 : నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రస్తుతం టీచింగ్ స్టాఫ్ వర్సెస్ నాన్ టీచింగ్ స్టాఫ్ అనేలా పరిస్థితులు మారాయి. కొద్దిరోజులుగా తరచూ వీరి మధ్య వివాదాలు నెలకుంటున్నాయి. తాజాగా రెండు రోజుల కిందట జరిగిన ఓ ఘటన చివరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు వరకు వెళ్లడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ట్రిపుల్ ఐటీలో పని చేస్తున్న ఓ ఉన్నతాధికారి తన వ్యక్తిగత అవసరానికి ఇనిస్టిట్యూట్‌కు చెందిన అధికారిక వాహనాన్ని ఉపయోగించగా దానిని నాన్ టీచింగ్ విభాగంలోని ఓ ఉద్యోగి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో మరింత చిచ్చు రాజేసింది. ట్రిపుల్ ఐటీలో ప్రొఫెసర్ హోదాలో పని చేస్తున్న ఓ ఉన్నతాధికారి అత్యవసర సమావేశం ఉండడంతో తాను బయటకు వెళ్లలేక నూజీవీడు పట్టణంలో చదువుతున్న తన కుమారుడిని క్యాంపస్‌కు తీసుకొచ్చేందుకు అధికారిక వాహనాన్ని పంపారు. పట్టణంలోని ఓ కాలేజీ వద్దకు ఆ వాహనం వెళ్లడం గమనించిన మెకానికల్ విభాగంలోని ఓ నాన్ టీచింగ్ ఉద్యోగి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వివాదానికి దారి తీసింది.

ఇటీవల టీచింగ్ స్టాఫ్‌కు సంబంధించిన క్వార్టర్స్‌లో దొంగతనం జరగడం, వాహన వివాదం నేపథ్యంలో ఆ ఉన్నతాధికారి నాన్ టీచింగ్ స్టాఫ్ వ్యవహార శైలిపై సామాజిక మాధ్యమంలో తన ఆవేదనను వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అంతేకాక నాన్ టీచింగ్ స్టాఫ్ వ్యవహార శైలిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొందరు రంగంలోకి దిగి టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు మధ్య రాజీకి ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఫిర్యాదుపై పట్టణ పోలీసుల వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

27, 28 తేదీల్లో డివిజన్ స్థాయి స్కూల్ అసిస్టెంట్ వెకెన్సీల భర్తీకి..
'సర్దుబాటు' కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, ఆగస్టు 23 : డివిజన్ స్థాయిలో సర్‌ప్లస్ టీచర్ల వర్క్ అడ్జస్టమెంట్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇటీవల మండలాల్లో కొరతవున్న పాఠశాలలకు మిగులు (సర్‌ప్లస్) స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేసిన అనంతరం డివిజన్ పరిధిలోకి చేర్చిన ఎలిజిబుల్ ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లను ఆయా మండలాల్లో ఇంకా కొరతవున్న పాఠశాలలకు కౌన్సెలింగ్ ద్వారా అడ్జస్ట్ చేయనున్నారు. ఇలా జిల్లాలోని ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డివిజన్ల పరిధిలోని మండలాల్లో మొత్తం 167 స్కూల్ అసిస్టెంట్ కేడర్ సబ్జెక్టు టీచర్ల వెకెన్సీలను భర్తీ చేస్తారు. డివిజన్ స్థాయి స్కూల్ అసిస్టెంట్ కేడర్ వెకెన్సీలను ఆయా మండలాల్లో భర్తీచేసిన అనంతరం సుమారు 140 మంది ఉపాధ్యాయులు మిగిలిపోతారని, వీరందరిని ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలకే వెనక్కి పంపించి వేయవచ్చని విద్యాశాఖ అంచనా వేస్తోంది. ఈ ప్రక్రియ ముగిసేలోగా సర్‌ప్లస్ ఎస్జీటీల సీనియార్టీ జాబితాలను మండలాలు, పాఠశాలల వారీగా విడుదలచేసి, వాటిపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. వీటిని పరిష్కరించిన తర్వాతే కౌన్సెలింగ్ ద్వారా మండలాల్లోనే సర్దుబాటు చేసేందుకు నిర్ణయించారు. మొత్తంమీద సర్‌ప్లస్ టీచర్ల సర్దుబాటు ప్రక్రియ నెలాఖరులోగా పూర్తిస్థాయిలో ముగిసే అవకాశాలున్నాయి.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


డాక్టర్ బీవీ పాపారావును సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 23: విద్యార్థు లు లక్ష్యాలను నిర్దేశించు కుని వాటి సాధనకోసం నిరంతరం కృషి చేయా లని అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లేబొరేటరి డైరెక్టర్, శాస్త్ర వేత్త డాక్టర్ బీవీ పాపా రావు అన్నారు. ఏపీ నిట్ బీటెక్ ప్రథమ సంవత్సర ంలో ప్రవేశాలు పొందిన 455 మంది విద్యార్థులకు వారం రోజులుగా నిర్వహిస్తున్న ఇండక్షన్ ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమానికి హాజరైన డాక్టర్ పాపారావు మాట్లాడుతూ పరిశోధనలలో కొత్త శిఖరాలను అధిరోహించడం అత్యంత అవసరమన్నారు. రక్షణ, పరిశోధన రంగంలో భారత్ స్వావలంభన సాధించి ప్రపంచానికే స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. చదువుకుంటున్న సమయంలో తాత్కాలిక ఆనందాలకు లొంగిపోతే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఏ వృత్తిలో అయినా రాణించాలంటే ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించాలన్నారు. అనంతరం డాక్టర్ పాపారావును సత్కరించారు. తొలున అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

టాయిలెట్ల ఫొటోలకు హెచ్‌ఎంలపై ఒత్తిడి వద్దు

ఏలూరు అర్బన్, ఆగస్టు 23 : పాఠశాలల్లో టాయిలెట్ల ఫొటోలను తీసే బాధ్యతల నుంచి స్కూలు ఉపాధ్యాయులను తప్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ హెచ్‌ఎంలపై ఇప్పటికీ విద్యాశాఖ ఒత్తిళ్ళు తప్పడంలేదని ఏపీటీఎఫ్ 1938 జిల్లా నాయకులు రత్నంబాబు, మోహనరావు ఓ ప్రకటనలో ఆరోపించారు. టాయిలెట్ల ఫొటోలను తీసి నిర్ణీత యాప్‌లో అప్‌లోడ్‌చేసే బాధ్యతలను వారానికి చెరో రెండురోజులపాటు సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, ఎస్‌ఎంసీ చైర్మన్‌కు అప్పగించిందన్నారు. ప్రతీరోజు మధ్యాహ్నం 3గంటల నుంచి 3.30 గంటల్లోగా హెచ్‌ఎంలు తనిఖీలు చేసి నివేదికను సమర్పించాలని విద్యాశాఖ ఉత్తర్వులివ్వడంతో మళ్ళీ హెచ్‌ఎం పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఫొటోలు తీయకపోయినా ఆ ఒత్తిడి స్కూల్ హెచ్‌ఎంలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

కష్టించే కార్యకర్తలకు గుర్తింపు

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ


కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

నరసాపురం రూరల్, ఆగస్టు 23: బీజేపీని పార్టీ శ్రేణులు మరింత బలో పేతం చేసేందుకు కృషి చేయాలని కేంద్ర సహా య మంత్రి శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల ంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశా నికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథ కాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అప్పుడే పార్టీపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. కష్టించి పని చేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్నికల్లో విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీనివాసవర్మను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ కె.సత్య నారాయణ, కె.త్రినాథ్, అద్దాల శ్రీహరి, బీజేపీ రాష్ట్ర నాయకులు పాకా సత్య నారాయణ, నారిన తాతాజీ, మేకల సతీష్, పీవీఆర్, ఉన్నమట్ల కబర్ది, ఎం వెంకటేశ్వరావు పాల్గొన్నారు


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రభుత్వ వైద్యం పేదలకు చేరువవ్వాలి: కలెక్టర్

పాలకొల్లు రూరల్, ఆగస్టు 23: ప్రభుత్వ వైద్యం పేదలకు చేరువుగా ఉండేలా వైద్య సిబ్బంది సేవలందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రసూతి, జనరల్ వార్డు తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఓపీ, ప్రసవాలు, జ్వరాల కేసులు వివరాలను వైద్యులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, తహసీల్దారు దుర్గాకిషోర్ ఉన్నారు.

ఆధునిక పద్ధతుల్లో చేపల సాగు చేయాలి

నరసాపురం రూరల్ ఆగస్టు 23: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక పద్ధతిలో చేపల సాగు చేస్తే ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడిని సాధించవచ్చునని జిల్లా మత్స్యశాఖ డీఎఫ్‌వో ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ భవనంలో మత్స్యశాఖ, ఎంపెడాల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సాగులో రైతులు మెళకువలను తెలుసుకోవాలన్నారు. వైరస్‌లు సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఉండాలన్నారు. అయితే వర్షం కారణంగా సదస్సుకు పెద్ద సంఖ్యలో రైతులు హాజరుకాలేకపోయారు. ఉన్న కొద్ది మందితోనే ముగించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎఫ్ ఆనందకుమార్, ఎఫ్‌డీవో ఎల్ఎల్ రాజు, పాల్గొన్నారు

సేవ అనే పదానికి స్ఫూర్తి చిరంజీవి

భీమవరం టౌన్, ఆగస్టు 23 : సేవ అనే పదానికి స్ఫూర్తి మెగాస్టార్ చిరంజీవి అని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చిరంజీవి కుటుంబం చేసే దాతృత్వం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను పట్టణ జనసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, మండల అధ్యక్షుడు మోకా శ్రీనివాస్, హరి, కృష్ణ, శ్రీను, నీలేంద్ర, బన్ను ప్రసాద్, చెన్నూరవి, వీర మహిళలు శ్యామల, మీనా, నాయకులు పాల్గొన్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి
DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

మధువర్షిణి మ్యారేజెస్

■ గత 21 సం॥లుగా అన్ని కులముల వారికి 1వ, 2వ పెండ్లి సంబంధములు కుదుర్చుచున్న అగ్రగామి సంస్థ. సంప్ర॥ తోట రవినాయుడు, మధువర్షిణి మ్యారేజెస్. ఒంగోలు. సెల్ : 93921 92193
AJO-200058

WANTED

★ త్రివేది హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 18k.
Ph: 9160900024, 9640400073
AJH-16356

PLOT FOR SALE

★ CRDA approved Chodavaram, Vijayawada gated layout Plots, 15 minutes from Benz Circle beautiful location between Krishna River & KEB Canal.
M-9948099840, 9866602266
AJH-98269

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దాని వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ప్రతిభకు పురస్కారం ఎన్‌ఎంఎంఎస్



- విజేతలకు ఐదేళ్ల చదువుకు స్కాలర్‌షిప్
- సంవత్సరానికి 12వేలు చొప్పున మొత్తం 60వేల స్కాలర్‌షిప్
- దరఖాస్తుకు ఆఖరు తేదీ సెప్టెంబరు 6
- పరీక్ష తేదీ డిసెంబరు 8

నిడమర్రు ఆగస్టు 23 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కీమ్ (ఎన్‌ఎంఎంఎస్) పథకాన్ని 2008లో ప్రారంభించింది. పరీక్ష రాయడానికి కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈ పరీక్షలో విజేతలుగా నిలిచినవారికి తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా 12 వేల రూపాయలు ఉపకార వేతనాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు అర్హతలు

- రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు
- ఏడో తరగతిలో 55% మార్కులు సాధించిన విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులు. తుది ఎంపిక సమయం నాటికి ఎనిమిదో తరగతిలో 55% మార్కులు పొంది ఉండాలి.
- అభ్యర్థి కుటుంబ వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ.3లక్షల 50 వేల లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులు.

పరీక్షా విధానం

ప్రతిభావంతులను ఎంపిక చేయడానికి రాతపరీక్షను నిర్వహిస్తారు. దీనిలో రెండు విభాగాలలో పరీక్ష రాయాల్సి ఉంటుంది.

ఎ. మ్యాట్ (మెంటల్ ఎబిలిటీ టెస్టు)

దీనిలో 90 మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ లేదు. దీనిలో విద్యార్థిలోని రీజనింగ్ నైపుణ్యాలను పరీక్షిస్తారు.

బి. శాట్ (స్కాలషిప్ ఆప్టిట్యూడ్ టెస్టు)

ఈ విభాగంలో 90 మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించబడుతుంది. నెగెటివ్ మార్కింగ్ లేదు. 7,8 తరగతులలో గణితం, సైన్స్, సోషల్ లకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి.

పరీక్ష ఫీజు

ప్రతి విద్యార్థి పరీక్ష ఫీజు రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 రూపాయల ఫీజు చెల్లించాలి.

రిజర్వేషన్ విధానం

ఎస్‌సీ - 15%, ఎస్‌టి- 6%, బీసీ ఎ- 7% , బీసీ బీ - 10% , బీసీ సీ - 1%, బీసీ-డీ 7%, బీసీ ఈ 4%, పీహెచ్- 3% ప్రాతిపదిక స్కాలర్‌షిప్‌కు విద్యార్థులను ఎంపిక చేయబడతారు.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తులు ఆన్‌లైన వెబ్‌సైట్‌లో ఆగస్టు 8 నుంచి స్వీకరిస్తున్నారు. దరఖాస్తు చేయడానికి సెప్టెంబరు 6వ తేదీ చివరి తేదీ. పరీక్ష రుసుము ఆన్‌లైన్ ద్వారా ఎస్.బి.ఐ. లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలి. పరీక్ష తేదీ 8 డిసెంబరు, 2024.

విద్యార్థి భవిష్యత్‌కు ఉపయుక్తం

- కె. సుబ్బరాజు గైడ్ టీచర్, ఉన్నత పాఠశాల ఫత్తేపురం



ఎన్‌ఎంఎంఎస్ అనేది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఒక వరం. ఎనిమిదో తరగతి నుంచే విద్యార్థులలో పోటీ పరీక్షలకు సంబంధించిన నైపుణ్యాలు పెంచడానికి ఈ పరీక్ష దోహదపడుతుంది. మెంటల్ ఎబిలిటీ కూడా ఈ పరీక్ష కోసం విద్యార్థి నేర్చుకోవల్సిన ఉండడంతో విద్యార్థి భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి ఈ ప్రిపరేషన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ఈ పరీక్షతో ఆత్మవిశ్వాసం పెరిగింది

- లింగంపల్లి జయరామ్



నేను ప్రాథమిక విద్య నుంచి ఎంటెక్ ఐఐటీ రూర్కీ వరకు ప్రభుత్వ విద్యను అభ్యసించాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ ప్రముఖ సంస్థలో డిజిటల్ డిజైన్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాను. ఈ పయునంలో ఎన్నో పోటీ పరీక్షలు ఎదుర్కొన్నాను. నా విద్యార్థి జీవితంలో నేను ఎదుర్కొన్న మొట్టమొదటి పరీక్ష ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్ష. 2013లో పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలో 8 వతరగతి చదువుతున్నప్పుడు రాసిన ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షలో విజేతగా నిలవడంతో ఆత్మ విశ్వాసం పెరిగింది. ఈ ఆత్మవిశ్వాసం నా గమ్యం దిశగా నడిపించింది.

భవిష్యత్ విద్యపై భరోసా కలిగింది

- కవల రిషిత, ఎంపీయూపీ స్కూల్, జల్లికొమ్మర



నేను గణపవరం మండలం జల్లికొమ్మర ప్రాథమికోన్నత పాఠశాలలో గత సంవత్సరం 8 వతరగతి చదువుతూ ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షలకు ప్రిపేరయ్యాను. ఈ పరీక్ష ద్వారా తొలిసారి రీజనింగ్, అర్థమేటిక్ అంశాలతో పరిచయం ఏర్పడింది. రీజనింగ్ ద్వారా తార్కిక జ్ఞానం పెంపొందించుకోవచ్చు. పరీక్షలో విజేతగా నిలిచిన నాకు ఆత్మవిశ్వాసం పెరిగింది. భవిష్యత్తు విద్యాభ్యాసంపై నమ్మకం కలిగింది.

ముగుస్తున్న శ్రావణం



- నాలుగు రోజుల్లో శుభ కార్యాలకు ఫుల్‌స్టాప్
- మళ్ళీ అక్టోబర్ 6 నుంచి డిసెంబరు 28 వరకు ముహూర్తాలు
- శ్రావణంలో భారీగా వివాహాలు

భీమవరం టౌన్, ఆగస్టు 23 : మరో నాలుగు రోజుల్లో శుభకార్యాలకు నెల రోజులపాటు ఫుల్‌స్టాప్ పడనుంది. శూన్య మాసం వల్ల శుభకార్యాలు ఉండవు. తిరిగి అక్టోబరు 6వ తేదీ నుంచి డిసెంబరు 28 వ తేదీ వరకు శుభకార్యాలకు అనుకూలంగా ఉంది. గత ఏప్రిల్ 30వ తేదీ నుంచి గురుమూఢం ప్రారంభం కావటంతో అప్పటి నుంచి శుభకార్యాయాలు నిలిచిపోయాయి. దీంతోపాటుగా మే 17నుంచి జూన్ 14 వరకు శుక్రమూఢం కావటంతోను, వెంటనే ఆషాడ మాసం కూడా కలసి రావటంతో దాదాపు 3నెలలపాటు శుభకార్యాలు నిలచిపోయాయి. దీంతో అన్ని వర్గాల వారు కొంత ఇబ్బందులు పడ్డారు. ఆగస్టు5వ తేదీనుంచి శ్రావణమాసం ప్రారంభం కావటంతో శుభకార్యాలకు శ్రీకారం చుట్టారు. గతంలో మూడు నెలలు లేకపోవటంతో శ్రావణ మాసం శుభకార్యాల సందడి నెలకొంది. బంగారం, వస్త్రదుకాణాలు, ఇలా అన్ని షాపులు కళకళలాడాయి. దీంతో పాటుగా శుభముహుర్తాలు కూడా బలంగా ఉండటంతో ఈనెల 9,15,16,17, 19, 22,23 తేదీలతో పాటుగా 26, 28 తేదీల ముహుర్తాలు బలంగా ఉండటంతో భారీగా వివాహలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు ఇలా అన్ని రకాల శుభకార్యాలు ఘనంగా చేసుకున్నారు. అయితే వర్షాకాలం కావటంతో కొంత ఇబ్బందులు కలిగినా ప్రస్తుతం ఇంటి వద్దకాకుండా కల్యాణ మండపాలల్లో నిర్వహించుకోవటంతో ఇబ్బందులు తక్కువగానే ఉన్నాయి మధ్యలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో బంధువులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మళ్లీ అక్టోబరు నుంచి బాజా భజంత్రీలు మోగనున్నాయి.


డ్రెయిన్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్ వద్ద ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసిన రైతులు

ఎట్టకేలకు బీదరుకోడు ప్రక్షాళన

- 15 సంవత్సరాల తరువాత తవ్వకం
- ఎమ్మెల్యే రఘురామ ఫొటోకు పాలాభిషేకం

ఆకివీడు రూరల్ ఆగస్టు 23 : సంవత్సరాల తరబడి రైతుల నిరీక్షణ.. కాళ్ళరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగినా ఫలితం లేదు. కొద్దిపాటి వరద వచ్చినా బీదరుకోడు పొంగి పొలాలు ముంపుబారిన పడి తీవ్రంగా నష్టపోతున్న రైతన్న ఆవేదన ఇన్నాళ్ళకు కార్యరూపం దాల్చింది. తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత డ్రెయిన్ త్రవ్వకం పనులు ప్రారంభించారు. ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాలకు చెందిన వరద నీటిని కొల్లేరులోని బీదరుకోడు డ్రెయిన్ ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి తీసుకెళుతుంది. ఈమండలాల్లోని ఆయకట్టు దీనిపై ఆధారపడి ఉంది. ప్రతియేటా వర్షాకాలంలో ఈకోడును తలుచుకోని రైతులుండరు. 15 సంవత్సరాలుగా ఈకాలువ కిక్కసతో నిండిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. అయితే ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చొరవతో కొల్లేరులోని బీదరుకోడు డ్రెయిన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని రైతులు తెలిపారు. ఏళ్ళ తరబడి ఉన్న సమస్య తీరనున్నదని ఆనందం వ్యక్తం చేశారు. ఈసమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంపై ఆగ్రహం

ఆకివీడు రూరల్ ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభల కార్యక్రమం సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో స్థానిక ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంతో అధికారుల తీరుపై అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు భగ్గుమన్నారు. అధికారులకు ముందుగానే తెలియజేసినప్పటికి ఫొటో పెట్టకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ప్రతి గ్రామంలో జరిగిన గ్రామసభలో అధికారులను నిలదీశారు. అధికారులు తమ తీరును మార్చుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్‌ఎస్ఎస్ శేఖర్

పొదుపుతో భవిష్యత్‌కు భరోసా

ఏలూరు క్రైం, ఆగస్టు 23 : భావితరాల అవసరాల కోసం తమ పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు పొదుపు చేసుకోవాలని జిల్లా ఆర్మ్డు రిజర్వు అదనపు ఎస్పీ ఎన్‌ఎస్ఎస్ శేఖర్ అన్నారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ సిబ్బంది, హోంగార్డులతో శుక్రవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్ మాట్లాడుతూ మానవునికి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతుంటాయని వాటన్నింటిని సమతుల్యతతో సరిదిద్దుకోవాలంటే ఖచ్చితంగా పొదుపు చేసుకోవాలన్నారు. సిబ్బంది టాక్స్ సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్ స్కీములపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బరోడా బ్యాంక్ సీనియర్ మేనేజర్ సురేష్, అసిస్టెంట్ మేనేజర్ భరత్‌కుమార్‌లు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, ఆర్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జేఏసీ, రెవెన్యూ ఉద్యోగుల సమావేశాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 23 : ఏపీజేఏసీ-అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను ఈ నెల 25న ఏలూరులోని రెవెన్యూ భవన్‌లో నిర్వహిస్తున్నట్టు సంఘ ఏలూరు జిల్లా చైర్మన్ కె.రమేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్య సంఘాల నాయకులు పాల్గొంటారని వివరించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఉంగుటూరు, ఆగస్టు 23: జాతీయ రహదారిపై చేబ్రోలు వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది కథనం ప్రకారం.. చేబ్రోలు గేటు లోంచి ఏలూరు వైపు మోటారు సైకిల్ వేగంగా వెళుతుండగా తణుకు నుంచి ఏలూరు వైపు వెళుతున్న కారు మోటార్ సైకిల్‌ను తప్పించబోయి బస్ షెల్టర్‌ను ఢీకొనడంతో దాని ఇనుప స్తంభం విరిగి పోయింది. అదే సమయంలో మోటారు సైకిల్, కారు పక్కనే ఉన్న గోతిలోకి వెళ్లి పోయాయి. కాగా బస్ షెల్టర్‌లో ఉన్న బల్లు అన్నపూర్ణకు ఎడమ కాలుకు తీవ్రగాయమైంది. జలుమూరి ఉదయ కిరణ్ (గోపీనాథపట్నం)కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

క్షతగాత్రులకు డాక్టర్ సేవలు


క్షతగాత్రుడికి బ్రీతింగ్ చికిత్స చేస్తున్న డాక్టర్ నార్నీ భావాజీ

పెంటపాడు, ఆగస్టు 23: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి తాడేపల్లిగూడేనికి చెందిన వైద్యుడు డాక్టర్ నారీ భావాజీ సత్వర చికిత్స అందించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగాల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు తాడేపల్లిగూడెంలో బంగారం పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరూ శుక్రవారం అలంపురం జాతీయ రహదారి పక్కన గాయాలతో పడి ఉండగా అటుగా కుటుంబంతో కారులో వెళ్తున్న డాక్టర్ నార్నీ భావాజీ గమనించారు. వీరిలో గోల్డ్ స్మిత్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలై బ్రీతింగ్ కూడా ఇబ్బంది గా మారడంతో తక్షణం స్పందించిన భావాజీ అతనికి బ్రీతింగ్ చికిత్స చేసి అంబులెన్స్‌పై తణుకు ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ భావాజీ స్పందించిన తీరుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాగా ప్రమాదం జరగడానికి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

మొగల్తూరు, ఆగస్టు 23: వ్యసనాలకు బానిసై ఒక వ్యక్తి ఆత్మహత్య కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ జి.వాసు కథనం ప్రకారం.. కెపిపాలెం నార్త్ గ్రామానికి చెందిన కారేపల్లి కిరణ్ (32) మద్యానికి బానిసగా మారి భార్యతో తరచూ గొడవలు పడుతున్నాడు. ఈనేపథ్యంలో గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య భర్త మధ్య వివాదాలు తలెత్తడంతో ఇంటి నుంచి బయటకు వెళ్ళిన కిరణ్ మామిడి చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుని భార్య చిన్నారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతునికి 9, 7 సంవత్సరాలు ఇద్దరు కుమారులు ఉన్నారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

కాళ్ళ ఆగస్టు 23 : లారీ ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కాళ్ళ ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. దొడ్డనపూడి గ్రామానికి చెందిన పోతురాజు ఇస్మాయిల్, తెనాలి అబ్రహంలు ద్విచక్ర వాహనంపై 22వ తేదీ దొడ్డనపూడి నుంచి కాళ్ళ గ్రామం వెళుతుండగా పాత ఇనుప సామాను కొట్టు వద్దకు వచ్చేసరికి ఎదురుగా రాంగ్ రూట్లో వస్తున్న లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరు భీమవరం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. ఆసుపత్రిలో బాధితుడు ఇస్మాయిల్ ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ: డ్రైవర్ మృతి

పెదపాడు, ఆగస్టు 23 : ఆగి వున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా సంగాపురం మండలం, వీరపల్లి గ్రామానికి చెందిన భీమినేని నరేష్ లారీలో రాజమండ్రి నుంచి విజయవాడ వైపు వెళుతున్నాడు. మార్గంమధ్యలో గురువారం రాత్రి పెదపాడు మండలం కలపర్రు జాతీయరహదారిపై సాయిబాబా దేవాలయం వద్ద మరమ్మతు నిమిత్తం రోడ్డు పక్కన ఆగి వున్న మరో లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నరేష్ తీవ్ర గాయాలతో లారీక్యాబిన్‌లో ఇరుక్కుపోగా, హైవే అంబులెన్స్, పోలీసులు అతి కష్టం మీద లారీడ్రైవర్‌ను క్యాబిన్‌లో నుంచి బయటకు తీసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మెడకోసిన భర్తకు రిమాండ్

ఏలూరు క్రైం, ఆగస్టు 23 : భార్యపై అనుమానంతో బ్లేడుతో మెడ కోసిన భర్తను ఏలూరు రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం దెందులూరు మండలం చల్లపల్లికి చెందిన ఎడ్లపల్లి రవికుమార్ పది సంవత్సరాల క్రితం ఏలూరులోని లునానీనగర్‌కు చెందిన హేమలత (32)ను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమెపై తరచు అనుమానం పడుతూ వేధించడంతో ఆమె కొంత కాలం క్రితం తన పుట్టింటికి లునానీనగర్‌కు వెళ్ళిపోయింది. ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి రవికుమార్ ఆమె వద్దకు వెళ్ళి ఆమె మెడను బ్లేడుతో కోసేశాడు. తీవ్ర గాయాలకు గురైన ఆమె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. రవికుమార్ పై హత్యాయత్న కేసును ఏలూరు రూరల్ పోలీసులు నమోదు చేశారు. అతనిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా 14రోజులు రిమాండ్ విధించారు.

నాలుగు ఫోన్లు రికవరీ

భీమవరం క్రైం, ఆగస్టు 23 : భీమవరం రైల్వే పోలీస్‌స్టేషన్ (జీఆర్‌పీ) పరిధిలో జరిగిన మొబైల్ మిస్సింగ్ కేసుల్లో సీఈఐఆర్ యాప్ ద్వారా భీమవరం జీఆర్‌పీ పోలీస్‌లు నాలుగు మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు శుక్రవారం భీమవరం జీఆర్‌పీ ఎస్ఐ పీటీవీ రమణ అందజేశారు.

మోటారు సైకిళ్ల దొంగలు అరెస్టు


నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 23: తాడేపల్లిగూడెం సర్కిల్ పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3.85లక్షల విలువ చేసే మోటారుసైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు ప్రకారం.. తాడేపల్లిగూడెం, పట్టణం, దేవరపల్లి, గోపాలపురం, నిడదవోలు, ఏలూరు, కోరుకొండ ప్రాంతాల్లో జరుగుతున్న చోరీలపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ దర్యాప్తులో భాగంగా తాడేపల్లిగూడెంలోని మిర్చి దాబా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంకు చెందిన పూలపల్లి శివసుబ్రహ్మణ్యం, తాడేపల్లిగూడెం జువ్వలపాలెంకు చెందిన మరపట్ల రాజ్‌కుమార్‌లు నేరం అంగికరించి వారు చోరీ చేసిన 8 మోటారుసైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై నాగరాజు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

నలుగురు దారి దోపిడీ దొంగల అరెస్టు

భీమవరం క్రైం, ఆగస్టు 23 : దారిదోపిడీకి పాల్పడ్డ నలుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు తెలిపారు. శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాళ్ళ మండలం కోపల్లె గ్రామానికి చెందిన కోన రమేష్ ఈనెల 22వ తేదీ రాత్రి సుమారు ఒంటి గంట ప్రాంతంలో ఒక వివాహ వేడుకలో ఫొటోలు తీసి ఇంటికి వెళుతున్నాడు. మార్గంమధ్యలో చినఅమిరం గ్రామం అంబేడ్కర్ సెంటర్ వద్దకు వెళ్ళేసరికి నలుగురు యువకులు రమేష్ వాహనాన్ని ఆపారు. జేబులో ఉన్న సొమ్ము ఇమ్మని లేనిపక్షంలో చంపుతామంటూ కత్తితో బెదిరించి కొట్టారు. అనంతరం అతని జేబులో ఉన్న ఐదువేల రూపాయల పర్సుని లాక్కుని వెళ్ళిపోయారు. దీనిపై రమేష్ శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా చినఅమిరం గ్రామానికి చెందిన కొడాలి సతీష్, బిరుదగడ్డ నరేష్, గూడపాటి ఉదయ్‌కుమార్, తెనాలి దావీద్‌లను శుక్రవారం మధ్యాహ్నం భీమవరం హాస్పిటల్స్ వెనుక రోడ్డులో అరెస్టు చేసినట్లు తెలిపారు. కొడాలి సతీష్‌పై ఒక హత్య కేసు కూడా ఉంది. గూడపాటి ఉదయ్‌కుమార్‌పై రెండు కేసులు, తెనాలి దావీదుపై రెండ కేసులు ఉన్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన నలుగురిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన సీఐ కాళీచరణ్, ఎస్ఐ రహ్మాన్, సిబ్బందికి రివార్డు అందిస్తామని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

భీమవరం క్రైం, ఆగస్టు 23 : రెండు రోజులు క్రితం భీమవరం మండలం రాయలం గ్రామంలో ఒక మహిళను మోసం చేసి మెరుగుపెడతామంటూ ద్రావకంలో బంగారం వేసి దోచుకెళ్ళిన బీహార్ రాష్ట్రానికి చెందిన ఏడుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసినట్టు అడిషనల్ ఎస్పీ వి.భీమారావు తెలిపారు. ఇటీవల ఇలాంటి నేరాలు, సైబర్ నేరాలు బాగా పెరిగాయని వాటిపై ప్రజలకు అవగాహన ఎంతైనా అవసరం అని అన్నారు. మనది కాని వస్తువు కోసం ఆశపడటం చాలా తప్పని మనం కష్టపడి సంపాదించుకోవాలే తప్ప ఇతరుల వస్తువులు, డబ్బుపై ఆశపెట్టుకోవడం దురాశ దుఃఖానికి చేటు అన్నారు. ఈ సమావేశంలో టూటౌన్ సీఐ జి కాళీచరణ్, ఎస్ఐ ఎఫ్ రహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.



పొగాకు వేలం కేంద్రం పరిశీలిస్తున్న ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్

పొగాకు రైతులకు అండగా ఉంటాం : ఎంపీ మహేశ్

కొయ్యలగూడెం, ఆగస్టు 23: పొగాకు రైతులకు అండగా ఉంటామని ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ అన్నారు. కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు సెస్ లేకుండా పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని, పామాయిల్ రైతులను కూడా అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, కరాటం సాయిబాబు, పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు నంది, తదితర రైతులు, టీడీపీ, బీజేపీ నాయకులు ఉన్నారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ పుట్టా మహేశ్‌కు కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నాయకులు వినతిపత్రం ఇచ్చారు. తామంతా ఏళ్ల తరబడి చేస్తున్నా ఉద్యోగ భద్రత లేదన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎంపీ పుట్టా మహేశ్ అన్నారు. గురవాయిగూడెంలో కరాటం రాంబాబు నివాసం వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని అమరావతికి దగ్గరగా ఉన్న ఏలూరు పట్టణాన్ని పారిశ్రామిక హబ్‌గా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. పామాయిల్ రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా మలేషియా వెళ్లనున్నట్లు తెలిపారు. అక్కడి పామాయిల్ రైతుల పరిస్థితులపై అధ్యయనం చేస్తామని, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో సెప్టెంబర్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, కూటమి నాయకులు కరాటం రెడ్డిబాబు, బొరగం శ్రీను, మేకా ఈశ్వరయ్య దాసరి శ్యామ్ చంద్రశేషు, గద్దమణుగు రవికుమార్, రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు మురుగునీటి శుద్ధి కేంద్రం ప్రారంభం



మురుగు శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఏలూరు టూటౌన్, ఆగస్టు 23: నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. తంగెళ్ళమూడిలో రూ.37.48 కోట్లతో భూగర్భ నీటి వ్యవస్థ, మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే చంటి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా 29, 38, 39, 40, 50, 1వ డివిజన్స్‌లో అమృత్ నిధులతో ప్రారంభించామన్నారు. గత ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం మురుగునీటి శుద్ధి కేంద్ర నిర్మాణ పనులను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం ట్రయల్ రన్ పనులను ప్రారంభించామన్నారు. త్వరలో పూర్తిస్థాయిలో ప్లాంట్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంఆర్.పెదబాబు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

'భూదాన యజ్ఞం' భూములు స్వాధీనం చేయాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

ఏలూరు రూరల్, ఆగస్టు 23: ఎస్సీ, బీసీలకు చెందిన భూదాన యజ్ఞ భూములను తక్షణం స్వాధీనం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. తాడువాయి గ్రామస్తులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కృష్ణచైతన్య మాట్లాడుతూ 1983లో ప్రభుత్వం తాడువాయి గ్రామంలో సర్వేనెం-99 నుంచి 140 వరకు 100మందికి ఒక్కో కుటుంబానికి ఎకరం చొప్పున కోర్టు పట్టాలు మంజూరు చేసిందన్నారు. వాటిని ఎస్సీ, బీసీలు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారన్నారు. ఆర్థిక స్తోమత లేనివారు బయట వ్యక్తులకు కౌలుకు ఇచ్చారన్నారు. కొందరు కౌలుదారున పేరున భూములను నమోదు చేశారని ఆరోపించారు. జంగారెడ్డిగూడెం తహసీల్దార్ హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ఆ భూములు స్వాధీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఆర్వోను కలిసిన వారిలో సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జె.వి రమణ, తాడువాయి గ్రామశాఖ కార్యదర్శి ఓ.కె చంద్రాత్రిమూర్తులు, కె.కోనేరావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఆగస్టు 23: సమాజంలో ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయాధికారి కె రత్నప్రసాద్ అన్నారు. నగరంలోని గుప్తా ఇండస్ట్రీస్ మహిళా కార్మికులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్మిక హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి కార్మికుడు కూడా బాధ్యతతో పనిచేయాలని వ్యవస్థ అభివృద్ధి చెందినప్పుడే కార్మికులు కూడా అభివృద్ధి చెందుతారన్నారు. కార్మికులకు ఎలాంటి న్యాయ సహాయం కావాల్సి వచ్చినా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఫ్యాక్టరీల తనిఖీ అధికారి త్రినాథ్ మాట్లాడుతూ కార్మికులకు సమస్యలు ఎదురైతే తమను సంప్రదించాలని సూచించారు. అసిస్టెంట్ కమీషనర్ నాగేశ్వరరావు, ఎ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో సదుపాయాలు కల్పించండి



కాలనీలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

బుట్టాయగూడెం, ఆగస్టు 23: దొరమామిడి కొత్త కోయిదా ఆర్ అండ్ ఆర్ కాలనీలో సదుపాయాలు కంచాలని కోరుతూ శుక్రవారం నిర్వాసిత ఆదివాసీలు ఆందోళన చేశారు. ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలనీ మధ్యలో వాగుపై వంతెన నిర్మించాలని, గంగమ్మ చెరువుకు మరమ్మతులు చేయాలని, పరిహారాన్ని నిర్వాసితుల ఖాతాలో వేయాలని, 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజి అమలు చేయాలన్నారు. వేట్ల రాజారెడ్డి, రత్నకుమారొరెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆశోక్‌రెడ్డి, రాంరెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజీఆర్ఎఫ్‌తో విద్యుత్ సమస్యల పరిష్కారం



ఫిర్యాదు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్

జీలుగుమిల్లి, ఆగస్టు 23: ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీజీఆర్ఎఫ్ (విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం) ద్వారా విద్యుత్ సమస్యల్ని త్వరితగతిన పరిష్కరిస్తున్నామని ఛైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, టెక్నికల్ సూపరింటెండెంట్ వి.జనార్ధన్ చెప్పారు. ఈ ఏడాది 536 సమస్యల్ని పరిష్కరించామన్నారు. వినియోగదారుడి ఎటువంటి సమస్య అయినా 60 రోజుల్లో పరిష్కరించబడుతుందన్నారు. సమస్య వాట్సాప్ నెం.94401 00105 కు లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు కాల్‌చేసి అధికారులకు తెలియజేయవచ్చన్నారు. వినియోగదారుడికి ఎటువంటి ఖర్చు లేకుండా విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. 2016 నుంచి ప్రతీ జిల్లాలో క్యాంపుల నిర్వహణ ద్వారా 276 సమావేశాలు నిర్వహించి 103 కేసుల్లో రూ.5.88,650 లక్షల నష్టపరిహారం ఇప్పించామన్నారు. కొందరు రైతుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏడీ టి.రాజ్‌కుమార్, ఏఈ నాగేశుడు, జెఇ హరిబాబు, సిబ్బంది వెంకట్, సత్యనారాయణ పాల్గొన్నారు.









పెదపాడు మండలం, జంగారెడ్డిగూడెం గ్రామసభల్లో మాట్లాడుతున్న అధికారులు, కొయ్యలగూడెం గ్రామసభలో వినతిపత్రాలు ఇస్తున్న గ్రామస్తులు, ద్వారకాతిరుమల గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

గ్రామాల అభివృద్ధి లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు
ఉపాధి పనులపై తీర్మానం
పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు

బుట్టాయగూడెం, ఆగస్టు 23: గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి, నిధులు తేవడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ తెలిపారు. బుట్టాయగూడెంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామసభల్లో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నివేదికలు సిద్ధం చేసి కేంద్రం నుంచి నిధులు రాబట్టి పనులు పూర్తిచేస్తామన్నారు. పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి చెల్లించిన తర్వాతే కాలనీలకు తరలిస్తామని తెలిపారు. ఏజెన్సీలో రోడ్ల నిర్మాణాలకు ఎంపీ నిధుల నుంచి రూ.3 కోట్లు కేటాయించి నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో సీసీ, లింక్ రోడ్లు ఇతర పనులు చేపడతామన్నారు. ఏజెన్సీలో గిరిజనుల కోసం 79 బీఎస్ఎన్ఎల్ టవర్లను నిర్మిస్తుండగా బుట్టాయగూడెం మండలంలో 40 టవర్లు నిర్మిస్తున్నట్లు ఎంపి తెలిపారు. మంచులవారిగూడెంలో నిర్మించిన బీఎస్ఎన్ఎల్ టవర్‌ను ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించారు. ఏజెన్సీలో ప్రాంతంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వివరించారు. నాయకులు బొరగం శ్రీనివాస్, కరాటం వెంకటరెడ్డినాయుడు, మొగపర్తి సోంబాబు, కరాటం సాయి, గెడ్డమ ఝగు రవికుమార్, ఎంపీపీ కారం శాంతి, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, తహసీల్దార్ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

- నిడమర్రు: ప్రతి గ్రామ పంచాయతీని స్వర్ణ పంచాయతీగా తీర్చదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉపాధి హామీ పథకం పనుల పనితీరు, నాణ్యతా ప్రమాణాల గురించి తోకలపల్లి, పత్తేపురం గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ గ్రామసభల ద్వారా పనులను గుర్తించాలన్నారు. ప్రత్యేకాధికారి షేక్ హబీబ్ భాషా, ఎంపీడీవో జి.విజయకుమారి, రుద్రరాజు వెంకటేశ్వరరాజు, తదితరులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు: నాచుగుంట గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పాటు పడదామని పిలుపునిచ్చారు. స్థానికులు గ్రామంలో సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో ఉపాధి పనులను ఎంపిక చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామసభలకు సర్పంచ్‌లు అధ్యక్షత వహించారు. నాచుగుంట సర్పంచ్ యేలేటి సునీత, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, తహసీల్దార్ సతీష్, ఎంపీడీవో ప్రేమాన్విత, అధికారులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.
- భీమడోలు: రాష్ట్రంలో పంచాయతీలను స్వయం శక్తి పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండల వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించారు. పోలసానపల్లి గ్రామ సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని పలు సమస్యలపై వినతిపత్రాలను అందుకున్నారు. సర్పంచ్ షేక్ రహీమా బేగమ్, అధికారులు, ప్రత్తి మదన్, తదితర నేతలు పాల్గొన్నారు. భీమడోలులో జరిగిన గ్రామ సభకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపట్టబోయే పనుల వివరాలను సభలో చర్చించారు. గ్రామంలోని వివిధ సమస్యలపై పలు వినతిపత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.
- ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో జరిగిన గ్రామసభలో మంచి నీటి సౌకర్యం, పారిశుధ్యం, డ్రెయినేజీ సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే వెంకట్రాజుకు వివరించారు. పంచాయతీ అభివృద్ధికి రూ.1.50 లక్షల నిధులు మంజూరు చేయించి పర్యాటక కేంద్రంగా ద్వారకాతిరుమలను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఐఎస్ జగన్నాథపురంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సైతం అభివృద్ధి చేస్తామని చెప్పారు.
- పెదపాడు: గ్రామాల సమగ్ర అభివృద్ధికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డీపీవో తూతిక విశ్వనాథ్ తెలిపారు. మండలంలోని గ్రామ సభల్లో డీపీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనులను గుర్తించాలన్నారు. ఆర్థిక సంవత్సరంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడం ద్వారా స్వర్ణ గ్రామాల సాధన లక్ష్యమన్నారు. గ్రామ సభల్లో ప్రత్యేకాధికారులు, సచివాలయ, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.
- పోలవరం: మండలంలో గ్రామసభలు నిర్వహించి పలు అభివృద్ధి పనులపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. జగన్నాథపేటలో అంగన్వాడీ కేంద్రం, డ్రైనేజీ సమస్యలు వివరించారు. కొత్త పట్టిసీమలో పశుశాలల లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా లేదని పాడి రైతులు వివరించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో జి.శ్రీను, సర్పంచ్‌లు పొడుం పుష్ప, ఘైగాపుల విజయదుర్గ, సబ్బారపు శ్రీరామ్మూర్తి, ఎస్.ప్రసాద్, కె.వెంకటలక్ష్మి, కె.బాపిరాజు, కుంచే దొరబాబు, కొణతాల ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.
- జంగారెడ్డిగూడెం: గ్రామసభల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టాల్సిన పనులను గుర్తించాలని ప్రత్యేకాధికారి మేరుగు ముక్కంటి సూచించారు. మండలంలోని వేగవరం, తాడువాయి, శ్రీనివాసపురం, పుట్లగట్లగూడెం, దేవులపల్లి గ్రామాలలో సర్పంచుల అధ్యక్షతన జరిగిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. తహసీల్దారు కె.స్లీవజోజి, డీటీ కె.రమేష్ పాల్గొన్నారు. పంగిడిగూడెం, గుర్వాయిగూడెం, లక్కవరం గ్రామ సభల్లో ఎంపీడీవో కేవీ.ప్రసాద్ పాల్గొన్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయితీలలో జరిగిన గ్రామ సభల్లో కూటమి నాయకులు పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం: మండలంలో గ్రామసభలు విజయవంతమయ్యాయి. గ్రామస్థులు పలు సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు, పుంతరోడ్లు, స్మశాసనవాటికలు, తదితర సమస్యలపై గ్రామసభలో చర్చించారు. అనేక పనులను గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.
- లింగపాలెం: గ్రామాలను అభివృద్ధిపథంలో నడిపించాలని, ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో పనులు చేయించుకోవాలని ఎంపీడీవో అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలతో పాటు శ్మశాన వాటికల్లో పనులను చేయించాలన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, కూటమి నేతలు పాల్గొన్నారు.
- చింతలపూడి: మండలంలో 19 గ్రామపంచాయతీల్లో గ్రామసభలు జరిగాయని, 18 పంచాయతీలకు సంబంధించి 1022 పనుల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో మురళీకృష్ణ తెలిపారు. సీసీరోడ్లు, సీసీడ్రైన్‌లు, పాఠశాల కాంపౌండ్‌వాల్స్, శ్మశాన వాటికలు సుమారు రూ.65కోట్లు వ్యయం కాగల పనులకు దరఖాస్తులు వచ్చాయన్నారు.
- టి.నరసాపురం: మండలంలోని 15 గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు పలు సమస్యలు విన్నవించారు. టి.నరసాపురం బండ్రేవు వద్ద ఎర్రకాలువ వంతెన నిర్మించాలని, గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజి నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు సభల దృష్టికి తీసుకువచ్చారని ప్రత్యేక అధికారులు ఈవోపీఆర్డి రాంప్రసాద్, ఏపీవో శ్రీనివాస్, ఏవో సుమలత తెలిపారు.
- కుక్కునూరు: గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై 15 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. అంతర్గత రహదారులు, లింక్‌రోడ్లు, నీటి సంరక్షణ పనులు, పండ్లతోటలు, పశువుల షెడ్లు, తదితర వ్యవసాయ అనుబంధ పనులకు సంబంధించి ప్రణాళికను గ్రామసభలో రూపొందించారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనుకుమార్, పిచ్చుక రాజు, ములిశెట్టి నాగేశ్వరరావు, యుగంధర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.
- వేలేరుపాడు: మండలంలోని 9గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించారు. ఉపాధి హామీ పనులపై గ్రామసభల్లో తీర్మానాలు చేశారు. రేపాకగొమ్ము గ్రామసభలో ఎంపీడీవో శ్రీహరి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.
- ఏలూరు రూరల్: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. గుడివాకలంక గ్రామంలో జరిగిన గ్రామసభలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానిక నాయకులు, గ్రామస్తులతో చర్చించారు. నంబూరి నాగరాజు, నేతల రవి, సైదు సత్యనారాయణ, ఎంపీడీవో బండి ప్రణవి, కూటమి నాయకులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు. మల్కాపురం, జాలిపూడి, కాట్లంపూడి, చాటపర్రు, శ్రీపర్రు, మాదేపల్లి, గుడివాకలంక, కోమటిలంక, కొకిరాయలంక,పైడిచింతపాడు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు.
- కామవరపుకోట: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామసభకు సర్పంచ్ కరిపోతు అనూష అధ్యక్షత వహించారు. ఉపాధి హామీ పథకంలో రోడ్లు, శ్మశానాలు, చెరువు పనులను ప్రతిపాదించి తీర్మానించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, వజీర్‌ఖాన్, బొబ్బిలి వీరబాబు, కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపిటిసిలు, సభ్యులు, తదిరులు పాల్గొన్నారు.
- పెదవేగి: దుగ్గిరాలలో వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక సమస్యలు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని ప్రభాకర్ అన్నారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, లావేటి శ్రీనివాసరావు, మాగంటి నారాయణ ప్రసాద్, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి టంగుటూరికి నివాళి



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 23: ఆంధ్రకేసరి, ఉమ్మడి రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం జిల్లా కేంద్ర గ్రంథాలయం, బాలల గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. కేంద్ర గ్రంథాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి స్వయంకృషితో ప్రకాశం పంతులు రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారన్నారు. ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించరు. గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- ఏలూరు అర్బన్: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్జీవోల సంఘ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ సీహెచ్.శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్ఈ దేవప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేశ్వరరావు, అధికారులు, సిబ్బంది టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.
- చింతలపూడి: రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యసాహసాలు, త్యాగనిరతి నేటితరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. ప్రగడవరం గ్రామసభలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ యువత సమరయోధుల త్యాగాలను గుర్తుంచుకోవాలన్నారు. సర్పంచ్ భూపతిరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
- కామవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు దారావతు మల్లేష్, కె.ఇందిరాకుమారి, ఎం.ఉషారాణి, పి.ఏడుకొండలు, విజయకృష్ణ, రత్నసిరి, కుమార్‌రాజా పాల్గొన్నారు.
- ఏలూరు క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఆర్ ఏఎస్పీ శేఖర్ మాట్లాడుతూ సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో గుండె చూపించిన ధైర్యశాలి అన్నారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, ఎం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల పరిస్థితిపై జిల్లా వైద్యాధికారి ఆరా



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

జీలుగుమిల్లి, ఆగస్టు 23: జ్వరాల పరిస్థితిపై జిల్లా వైద్యాధికారి పీహెచ్‌సీ వైద్య సిబ్బందిని ఆరా తీశారు. శుక్రవారం పీహెచ్‌సీని సందర్శించి వైద్య సేవలపై సిబ్బందితో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ పరిస్థితులతో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందాయన్నారు. డెంగీ జ్వరాలు రాకుండా చేపట్టే చర్యలపై ప్రజలకు వైద్య, పంచాయితీ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 157 డెంగీ, 53 మలేరియా, 10 చికన్‌గున్యా జ్వరాలు నమోదయ్యాయన్నారు. ప్రస్తుతం డెంగ్యూ కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమకాటుతో జ్వరాల బారిన పడకుండా దాతలు అందజేసే దోమ తెరలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇమ్యూనిటీ అధికారి విపి.దేవి, డాక్టర్ గాయత్రి ఉన్నారు.

తపాలా స్టాంపుల సేకరణపై పోటీ పరీక్ష

ఏలూరు అర్బన్, ఆగస్టు 23: తపాలా స్టాంపుల సేకరణపై విద్యార్థులకు అవగాహనలో భాగంగా దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన-2024 ఫిలాటలి (సేకరణ)లో పోటీ పరీక్ష నిర్వహించి స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు ఏలూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్‌బాబు శుక్రవారం తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతీ తరగతి నుంచి పదిమంది విద్యార్థులను ఎంపికచేసి నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6వేలు ఉపకార వేతనం అందజేస్తామన్నారు. సెప్టెంబరు 30న ప్రాంతీయ స్థాయి పోటీ పరీక్ష, రెండో విభాగంలో ఫిలాటలీ ప్రాజెక్ట్ పరీక్ష నిర్వహిస్తారని వివరించారు.



రేషన్ డీలర్ల రాష్ట్ర అధ్యక్షుడు లీలామాధవరావును సన్మానిస్తున్న డీలర్లు

కూటమి ప్రభుత్వంలో రేషన్ డీలర్లకు మంచి రోజులు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 23: కూటమి ప్రభుత్వంలో రేషన్ డీలర్లకు మంచిరోజులు వస్తున్నాయని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు అన్నారు. చింతలపూడి, పోలవరం, గోపాలపురం నియోజకవర్గాల రేషన్ డీలర్ల సమావేశం జంగారెడ్డిగూడెం డివిజన్ అధ్యక్షుడు పి.అన్వర్‌బాషా అధ్యక్షతన శుక్రవారం జరిగింది. లీలామాధవరావు మాట్లాడుతూ గత ఐదేళ్లలో సుమారు 30 వేల రేషన్ డీలర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో త్వరలో రేషన్ డీలర్లకు మంచి రోజులు వస్తున్నాయన్నారు. క్వింటా రేషన్ బియ్యానికి ప్రభుత్వం ప్రస్తుతం డీలరుకు రూ.100 కమీషన్‌చెల్లిస్తుండగా కూటమి ప్రభుత్వంలో క్వింటాకు రూ.150, గౌరవ వేతనం రూ.5వేలు పొందడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ డీలర్లను బ్యాంకు కరస్పాండెంట్‌గా నియమించాలని, కొన్ని ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించే అవకాశం ప్రభుత్వం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వి.నరసింహారావు, కంచర్ల రమేష్, చినరాజు, గుప్త, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, వర్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు







ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, పత్తేబాద కనకదుర్గ, చేబ్రోలు గాయత్రి

ద్వారకాతిరుమల, ఆగస్టు 23: శ్రావణమాస మూడో శుక్రవారం సందర్భంగా జిల్లాలోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ద్వారకా తిరుమల కుంకుళ్లమ్మను భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. ముందుగా సిబ్బంది ఆలయాన్ని పుష్పమాలికలు, మామిడితోరణాలు. అరటిబోదెలతో సుందరీకరించారు. కుంకుమపూజలు జరిపి హారతులిచ్చారు.

- ఉంగుటూరు: అమ్మవార్ల ఆలయాలలో విశేష పూజలు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉంగుటూరు భద్రకాళి ఆలయం, చల్లాలమ్మ, కనకదుర్గ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.
- ఏలూరు కార్పొరేషన్: నగరంలోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక వరలక్ష్మి వ్రతాలు, పసుపు కొమ్ముల నోములు నోచుకున్నారు. అమ్మవారు విశేష అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సౌభాగ్యలక్ష్మీదేవిని విజయలక్ష్మిగా అలంకరించారు. పత్తేబాదలోని కనకదుర్గమ్మను తమలపాకులతో అలంకరించారు. బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ భక్తులకు కాశీ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. పన్నెండుపంపుల సెంటర్‌లో కనకదుర్గమ్మకు పంచరంగుల గాజులతో అలంకరించారు. అంబికాదేవి సన్నిధిలో మహిళలు వరలక్ష్మీవ్రతాలతోపాటు పసుపు కొమ్ముల నోములు ఆచరించారు.

చంద్రయాన్ విజయం 'ఇస్రో' ఘనత



బహుమతులందజేస్తున్న జిల్లా సైన్స్ ఆఫీసర్

ఏలూరు అర్బన్, ఆగస్టు 23: జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని సెయింట్ థెరిసా మహిళా కళాశాలలో 'ఇస్రో' పరిశోధనలు, దేశ మార్గదర్శక పాత్ర అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయంతో భారత్ చరిత్రను సృష్టించిందన్నారు. అంతరిక్ష విజ్ఞానం, చంద్రయాన్ ప్రయోగంపై విద్యార్థినులకు క్విజ్, పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు. కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ సెలీన్‌రోజ్, వైస్ ప్రిన్సిపాల్ మరియా క్రిస్టియా, సిస్టర్ సుశీల పాల్గొన్నారు.

గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలులో నిర్వహించిన కార్యక్రమలో విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు తెలిపారు. స్పేస్ మోడలింగ్ పోటీలో దుర్గాప్రసాద్, క్విజ్‌లో తేజశ్వరి, పెయింటింగ్‌లో దుర్గాసాహిత్‌లకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం పాల్గొన్నారు. ఆర్ఆర్.పేట ప్రైవేటు హైస్కూలులో నిర్వహించిన వేడుకలో టంగుటూరి విగ్రహానికి హెచ్ఎం సత్యశారద పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు బాటలో నడవాలని విద్యార్థులకు సూచించారు.

వైసీపీ పదవికి బీసీ నేత రాజీనామా



ఏలూరు రూరల్, ఆగస్టు 23: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలచారి ఆ పదవికి రాజీనామా చేశారు. బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాద్‌ను కలిసి శుక్రవారం రాజీనామా పత్రాన్ని అందజేశారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బీసీలకు చేసిన అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాజకీయాలకతీతంగా పనిచేస్తానన్నారు.

నేడు మంత్రి పార్థసారథి చింతలపూడి రాక

చింతలపూడి, ఆగస్టు 23: మంత్రి కొలుసు పార్థసారథి శనివారం చింతలపూడి మండలంలో పర్యటించనున్నారు. రూ.20కోట్ల వ్యయంతో పంచాయతీ రాజ్‌శాఖకు చెందిన బోయగూడెం, సీతానగరం 16 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. నామవరం గ్రామం, కనకదుర్గమ్మ గుడివద్ద ఈ శంకుస్థాపన జరుగుతుంది.

నరసింగపురంలో కొబ్బరితోట పరిశీలించిన కలెక్టర్

చింతలపూడి, ఆగస్టు 23: ప్రగడవరం పంచాయతీ వద్ద శుక్రవారం గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి ముందుగా నరసింగపురం గ్రామంలో కొప్పర్ల నాగరాజుకు చెందిన కొబ్బరితోటను పరిశీలించారు. ఉద్యానవన పంటలకు ఉపాధి సాయం అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మొక్క చుట్టూ తోటచుట్టూ కందకాలు ఏర్పాటు వల్ల వర్షపు నీరు నిల్వ ఉంటుందని, ఈవిధంగా మట్టి పనులు చేయించి రైతుకు అందిస్తామని తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** కస్తూరిబా బాలికల మున్సిపల్ హైస్కూలుకు రిటైర్డ్ హెచ్ఎం జల్లా వీరభద్రరావు శుక్రవారం సౌండ్ సిస్టం అందజేశారు. పాఠశాలకు వీరభద్రరావు అండగా ఉన్నారని హెచ్ఎం సునీత అన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో పేలుడులో కార్మికుల మరణానికి కారకులైన యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాష డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత ప్రమాణాల అమలులో నిర్లక్ష్యాన్ని ఖండించారు.
- **పోలవరం :** ఫార్మా కంపెనీలో కార్మికుల మృతికి కారకులైన యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏజన్సీ గిరిజన సంఘం, రైతుకూలీ సంఘం డిమాండ్ చేశాయి. భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యం తీరుపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని షేక్ భాషా కోరారు.
- **కుక్కునూరు :** ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ, బోటని అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అతిథి అధ్యాపకులుగా దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కెమిస్ట్రీ సబ్జెక్టుకు కొవ్వాల మణి, బోటని సబ్జెక్టుకు పీ.విష్ణు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.
- **టి.నరసాపురం :** కృష్ణాపురంలో రాముని గుడి వద్ద తిరుమలదేవిపేటకు చెందిన సాధనా నరసింహారావు సహకారంతో మోటారు బోరు ఏర్పాటు చేసినట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం బోరు ఏర్పాటు పనులను దాత నరసింహారావు ప్రారంభించారు. నరసింహారావును అభినందించారు. కార్యక్రమంలో యెల్లిన వెంకటరత్నం, భూక్యా రామకృష్ణ, రాజా నాయక్, రవి, వెంకట్, రమేష్ తదితరులు ఉన్నారు.


రమణక్కపేట గ్రామసభలో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి


దొడ్డిపట్ల సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీఈవో నిర్మల జ్యోతి


కలిదిండిలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి విజయరాజు


మండవల్లిలో వార్డు సభ్యులు గైర్హాజరుపై ప్రశ్నిస్తున్న భాస్కరరావు

స్వర్ణ పంచాయతీలే ధ్యేయం

రూ. కోట్లతో గ్రామాల అభివృద్ధికి సీఎం చర్యలు ● మంత్రి పార్థసారథి ● 'ఉపాధి' గ్రామ సభలు సక్సెస్

నూజివీడు/నూజివీడు టౌన్, ఆగస్టు 23: స్వర్ణ గ్రామ పంచాయతీలే ధ్యేయంగా ఉపాధి పథకం కింద ఏలూరు జిల్లాలో రూ.223 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నూజివీడు మండలం బోర్వంచలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో మంత్రి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాజకీయ వివక్షత లేకుండా అర్హులైన వారందరికి జాబ్‌కార్డులు ఇచ్చి పనులు చూపాలని, అధికారులకు సూచించారు. నిధుల లేమి ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు సుమారు రూ.2వే లకోట్లతో ఆర్‌అండ్‌బి రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైన్‌లు అభివృద్ధి చేయాలని, స్కూల్ ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీకి సొంత భవనాలు కల్పించాలని గ్రామస్థులు మంత్రిని కోరారు. జనసేన నాయకుడు బర్మా ఫణిబాబు, సర్పంచ్ విజయ్‌రాజు, అరికోటి సంగీత రావు, ఎంపీడీవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు. నూజివీడు మండలంలో 29 పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు జరిగాయి. నూజివీడు ఏపీవో సోమేశ్వరి అధ్యక్షతన ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్.రామ్మోహన్ మండలంలోని దిగవల్లి, మిట్టగూడెం గ్రామ సభల్లో పాల్గొన్నారు. ప్రజావసరాలకనుగుణంగా పనులు చేపట్టి నిధులను సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు

ముసునూరు: ఉపాధి పథకం ద్వారా రూ.20 కోట్లతో నూజివీడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పరుస్తామని మంత్రి పార్థసారథి అన్నారు. రమణక్కపేట గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన ఉపాధి గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. తొలుత మహాత్మాగాంధీ, టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయ ప్రాంగణంలో కొబ్బరిమొక్కను నాటారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రమణక్కపేటలో 88 పనులను గుర్తించారన్నారు. గ్రామంలోని దళితవాడలో తాగునీటి సమస్యను వారం రోజుల్లో పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సర్పంచ్ రంగు ధనలక్ష్మి, ఎంపీపీ కొండా దుర్గాభవాని, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, ఎంపీడీవో జి.రాణి, తహసీల్దార్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: ఉపాధి నిధులతో గ్రామాలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేసుకొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీవో వెంకటరత్నం అన్నారు. చాట్రాయి, బూరుగ్గూడెంలలో జరిగిన ఉపాధి గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి, పనిచేసిన 15 రోజులలోపు వేతనాలు చెల్లింపు, స్త్రీ పురుషులకు సమాన వేతనం ఇవ్వటం జరుగుతుందన్నారు. ఎంపీడీవో దుర్గాప్రసాద్, ఎంఈవో బ్రహ్మచారి, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, అంబటి సత్యనారాయణ, కోట జోషి తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: వట్టిగుడిపాడు గ్రామసభలో మంత్రి పార్థసారథి గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సర్పంచ్ యలమర్తి కిరణ్మయి, అధికారులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మివిక్టర్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. పంచాయతీ కార్యదర్శి బొలిసేని ప్రసాద్, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని ఏ విధంగా పరిష్కరించుకోవాలో వివరించగా తెలియచేశారు.

కైకలూరు: ప్రజలకుపయోగపడే పనులను గుర్తించి స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి, ఇన్‌చార్జి సీఈవో ఎస్. నిర్మలజ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని 26 పంచాయతీల్లో ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. దొడ్డిపట్లలో జరిగిన సభలో నిర్మలజ్యోతి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రజలకు బాగా అవసరమైన పనులను ప్రజల ద్వారానే తెలుసుకొని గ్రామసభల్లో ఆమోదించి ఆన్‌లైన్లో పొందుపరచాలన్నారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్, కుళాయి, కరెంటు సరఫరా అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. కృష్ణాడెల్టాలో శివారు ప్రాంతంలో కైకలూరు ఉండడం వల్ల నీటి ఎద్దడి ఉందని, కనీసం మంచినీటి చెరువులకు నీరు సరఫరా కాలేదని ఇప్పటికే కామినేని శ్రీనివాస్ జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడారని, త్వరలోనే నీటి సరఫరా అవుతుందన్నారు. మంచినీటి చెరువులు నిండేవరకు ఆక్వారైతులు అక్రమంగా నీటి తోడకాలను నిలిపివేసి సహకరించాలన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ బలరామరాజు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ రవి శంకరరావు, ఉప సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. కైకలూరు గ్రామసభలో నిర్మలజ్యోతి పాల్గొన్నారు. సర్పంచ్ నవరత్నకుమారి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు పోలవరపు లక్ష్మీరాణి, పూల రామచంద్రరావు, కొల్లి బాబి, కీర్తి వెంకటరాం ప్రసాద్, కెకె బాబు, ఎండీ జానీ, బోయిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి సభకు వార్డు సభ్యుల డుమ్మా

మండవల్లి: మండవల్లి సచివాలయ ఆవరణలో జరిగిన గ్రామసభకు 13 మంది వార్డు సభ్యులకుగాను ఇద్దరు మాత్రమే హాజరవ్వడంపై ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సభలో మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ కె. బాబ్జి, గ్రామసభల స్పెషల్ ఆఫీసర్, ఏవో జె. శ్రీనివాస్, కార్యదర్శి ఎం. కొండలు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్, ఎం. సత్యనారాయణ, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. సభలో ప్రజల సూచన మేరకు 21 సీసీ రోడ్డు పనులు, 38 సీసీ డ్రైన్ల నిర్మాణానికి తీర్మానం చేశారు. మండలంలోని ఇంగిలిపాకలంకలో 10 గంటలకు ప్రారంభం కావాల్సిన గ్రామసభ ఇన్‌చార్జి అధికారి సమయపాలన పాటించకపోవడంతో గ్రామస్థులు గంటల కొద్ది నిరీక్షించారు.

ముదినేపల్లి: మండలంలోని 32 పంచాయతీల సర్పంచ్‌ల అధ్యక్షతన ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో గ్రామసభలను నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.వి.నాగరాణి మండలంలోని శ్రీహరిపురంలో సర్పంచ్ వరసా విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పాల్గొని పంచాయతీ పరిధిలో చేపట్టనున్న పనులపై ఎంపీడీవో మల్లీశ్వరితో పాటు గ్రామస్థులతో చర్చించారు. గ్రామ సభల్లో ఎక్కువ శాతం పక్కా డ్రైన్లు, పాఠశాలల ఆవరణల అభివృద్ధి, పశువుల సంరక్షణ షెడ్లు, పంట, మురుగు కాల్వల అభివృద్ధి, చెరువుల తవ్వకాలకు సంబంధించి ప్రజలు, రైతుల నుంచి వినతులు అందాయి. ముదినేపల్లిలో సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పక్కా డ్రెయిన్ల నిర్మాణ ప్రతిపాదనలు అందాయి. కూటమి నాయకులు పాల్గొన్నారు.

కలిదిండి: ఉపాధి పథకం ద్వారా గ్రామాలను స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు అన్నారు. శుక్రవారం కలిదిండి, సానారుద్రవరంలో నిర్వహించిన ఉపాధి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా జరిగే అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఎంపీడీవో దినతేజ్, ఉపాధి పనుల ఏపీవో ఆనంద్, టెక్నికల్ అసిస్టెంట్ రాజేష్, కలిదిండి, సానారుద్రవరం సర్పంచ్‌లు మారుతి ప్రసన్న, రాజేశ్వరమ్మ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఐదు నెలలుగా జీతాల్లేవ్

హైస్కూళ్ల స్వీపర్ కం స్కావెంజర్ల గగ్గోలు

ముదినేపల్లి, ఆగస్టు 23 : జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేస్తున్న స్వీపర్ - కం - స్కావెంజర్స్, నైట్ వాచ్‌మెన్‌కు గత ఐదు నెలలుగా జీతాలు అందటం లేదు. ముదినేపల్లి మండలంలోని జడ్పీ హైస్కూళ్లలో పని చేస్తున్న వీరికి ఈ ఏడాది మార్చి నుంచి జీతాలు అందలేదు. నెలకు రూ.6 వేల జీతంపై పని చేసే ఈ ఉద్యోగులు హైస్కూల్ గదులను, మరుగుదొడ్లను శుభ్రం చేయాలి. ఒక్క రోజు వాళ్లు చీపురు పట్టకపోతే అంతా అపరిశుభ్రతే. వీరికి ఇచ్చే జీతం తక్కువే అయినా సర్వశిక్షా అభియాన్ అధికారులు బడ్జెట్‌ను సకాలంలో విడుదల చేయకపోవటం వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వేరే పనులకు వెళ్లే అవకాశం లేకపోవటం, నెలనెలా జీతాలు రాక జీవనోపాధి భారంగా మారిందని, జీతాలు వెంటనే విడుదల చేయాలని పలువురు స్వీపర్లు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు ఆగస్టు 23: మండలంలోని 3 సబ్ స్టేషన్లలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ కె రామకృష్ణ తెలిపారు. శనివారం ఉదయం కైకలూరులోని రెండు సబ్ స్టేషన్లు, వరహాపట్నంలోని సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులంతా సహకరించాలని కోరారు.


గంగానమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కామినేని

గంగానమ్మ జాతర ప్రారంభం

కైకలూరు ఆగస్టు 23: వరహాపట్నంలోని గంగానమ్మ జాతర మహోత్సవాలను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి పట్టువస్త్రాలు, పండ్లు సమర్పించారు. సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి, మాజీ సర్పంచ్ బోయిన శ్రీనివాసరావు, టీకేఎం నాని, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వరహాపట్నం గ్రామంలో రూ.25లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ భూమిపూజ చేశారు. ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ నాగమణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రీశ్యామలాంబ ఆలయానికి పోటెత్తిన భక్తులు

కైకలూరు ఆగస్టు 23: శ్రావణ మాస మహోత్సవాల సందర్భంగా మూడో శుక్రవారం కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. అమ్మవారికి అలంకరణకు దాత రామిశెట్టి దుర్గారావు సహకారం అందించగా ప్రసాదానికి పొట్లూరి జగన్మోహనరావు, మండా రాఘవులు, వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, బొప్పన మంగతాయారమ్మ, నాగిరెడ్డి శ్యామలరావు, తిరుమాని శ్యామలరాజు సహకారం అందజేశారు. ఆలయ అధికారి వీఎన్‌కె శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీలక్ష్మమ్మ, అంకమ్మ ఆలయంలో 16 రోజుల పండుగ

చాట్రాయి, ఆగస్టు 23: ఇటీవల పునః ప్రతిష్ఠించిన ఆరుగొలనుపేటలోని శ్రీలక్ష్మమ్మ, అంకమ్మ అమ్మవార్ల ఆలయంలో శుక్రవారం 16 రోజుల పండుగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలగాని పిచ్చేశ్వరరావు దంపతులు అమ్మవార్లకు బంగారు కళ్ళు, ముక్కెర అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పొగాకు రైతులకు అండగా ఉంటాం : ఎంపీ మహేశ్

కొయ్యలగూడెం, ఆగస్టు 23: పొగాకు రైతులకు అండగా ఉంటామని ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ అన్నారు. కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు సెస్ లేకుండా పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని, పామాయిల్ రైతులను కూడా అన్ని విధాల ఆదుకుంటా మన్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, కరాటం సాయిబాబు, పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు నంది, తదితర రైతులు, టీడీపీ, బీజేపీ నాయకులు ఉన్నారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ పుట్టా మహేశ్‌కు కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నాయకులు వినతిపత్రం ఇచ్చారు. తామంతా ఏళ్ల తరబడి చేస్తున్నా ఉద్యోగ భద్రత లేదన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

క్రైం సమాచారం

బాకీ అడిగాడని బీరు సీసాతో దాడి

చాట్రాయి, ఆగస్టు 23: మండలంలోని పోలవరంలో శుక్రవారం బాకీ విషయమై ఇద్దరు వ్యక్తులు ఘర్షణపడి బీరు సీసాతో దాడి చేయడంతో ఒకరు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఎస్సై కేసీహెచ్ స్వామి వివరాల ప్రకారం పోలవరం ఎల్లమ్మ గుడి వద్ద శుక్రవారం బిలుగుది సురేష్ అలియాస్ చిట్టిబాబుని పజ్జూరి వెంకటరత్నం తన వద్ద అప్పుగా తీసుకున్న రూ. 5000 ఇవ్వమని అడుగగా అతను పరుషంగా సమాధానం ఇవ్వటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీనితో చిట్టిబాబు ఆవేశంగా పక్కనే ఉన్న బీరుసీసా పగలగొట్టి వెంకట రత్నంపై దాడి చేశాడు. దీంతో వెంకటరత్నం తీవ్రంగా గాయపడి చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశామని, శనివారం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై చెప్పారు.



నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో, తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో.. అక్కిరెడ్డిగూడెంలో టంగుటూరికి ఘన నివాళులు

ఆంధ్ర కేసరికి ఘన నివాళి

చాట్రాయి, ఆగస్టు 23: మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హెచ్ఎం వెంకట్రావు మాట్లాడుతూ 1928లో జరిగిన సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో దమ్ముంటే కాల్చమని తన గుండె చూపించిన ధైర్యశాలి ఆంధ్ర కేసరి అన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి సీఎంగా ప్రకాశం పంతులు 2 వేల మంది ఖైదీలకు క్షమాభిక్ష పెట్టటంతో పాటు, తిరుపతిలో వెంకటేశ్వర యూనివర్సిటీని స్థాపించారని, విజయవాడలో కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజ్ నిర్మించారని అన్నారు.

నూజివీడు: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. నూజివీడు ఆర్డీవో వై.భవాని శంకరి టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహాత్ముల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని, వారి బాటలో నడవాలని కోరారు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు ప్రకాశం పంతులు చేసిన సేవలను ఆమె శ్లాఘించారు. కార్యాలయ పాలనాధికారి దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు: మండలవ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో ఆంధ్రకేసరి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అక్కిరెడ్డిగూడెంలో సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మిసత్యనారాయణ ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిదిండి: కలిదిండి గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు, సాహితీ మిత్రులు టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్రాస్ సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా తన గుండెను తుపాకీకి చూపించిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయుడని కొనియాడారు.

మండవల్లి: చింతపాడు జడ్పీ హైస్కూలులో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో కేక్ కట్‌చేసి మాట్లాడుతున్న వల్లభనేని శ్రీనివాస్ చౌదరి

ఘనంగా వల్లభనేని పుట్టిన రోజు వేడుకలు

కలిదిండి, ఆగస్టు 23 : కలిదిండిలో శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి పుట్టిన రోజు వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. బర్త్ డే కేక్ కట్ చేసిన అనంతరం అన్నదానం నిర్వహించారు. పార్టీ శ్రేణుల మధ్య పుట్టినరోజు వేడుకలను జరుపుకోవటం సంతోషంగా ఉందని, కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీనివాస్ చౌదరి అన్నారు. టీడీపీ కలిదిండి, కైకలూరు మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, త్రినాథ రాజు, మాజీ జడ్పీటీసీ రమాదేవి, నున్న కృష్ణబాబు, డీసీ మాజీ ఛైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పి.సత్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షుడు పూల రాజీ, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ వద్ద భోజనం పంపిణీ

కైకలూరు: శుక్రవారం కలిదిండి ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి పుట్టినరోజు సందర్భంగా అన్నక్యాంటీన్ వద్ద పేదల సమక్షంలో కేక్ కట్ చేసి ఉచితంగా భోజనాన్ని పంపిణీ చేశారు. కూటమి నాయకులు పోకల జోగిరాజు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, వీరాబత్తిన సుధా తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ బహిష్కరిస్తున్నాం..

ముదినే పల్లి, ఆగస్టు 23 : రికార్డుల కంప్యూటరీకరణ కార్యక్రమాన్ని 3 రోజులపాటు ఉద్యోగులు బహిష్కరిస్తున్నట్లు ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘు రామ్ తెలిపారు. పని దినాలు, సెలవు దినాల్లో కూడా 24 గంటలపాటు సంఘాల కంప్యూటరైజేషన్ చేయాలని డీసీవోలు జారీ చేసిన ఆదేశాలు సంఘాల ఉద్యోగులకు ప్రాణ సంకటంగా మారాయని తెలిపారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో ప్రభుత్వ సెలవు దినాలు అయినప్పటికీ కంప్యూటరీకరణ చేయాల్సిందేనని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, ఇందుకు నిరసనగా పై మూడు రోజులు సంఘాల కంప్యూటరీకరణను ఉద్యోగులు బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, శనివారం నిర్వహించ తలపెట్టిన పీఏసీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ కార్యక్రమాన్ని సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ మేరకు వాయిదా వేస్తున్నట్లు రఘురామ్ తెలిపారు.

జ్వరాల పరిస్థితిపై జిల్లా వైద్యాధికారి ఆరా



జీలుగుమిల్లి, ఆగస్టు 23: జ్వరాల పరిస్థితిపై జిల్లా వైద్యాధికారి పీహెచ్ సీ వైద్య సిబ్బందిని ఆరా తీశారు. శుక్రవారం పీహెచ్‌సీని సందర్శించి వైద్య సేవలపై సిబ్బందితో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ పరిస్థితులతో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందాయన్నారు. డెంగీ జ్వరాలు రాకుండా చేపట్టే చర్యలపై ప్రజలకు వైద్య, పంచాయితీ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 157 డెంగీ, 53 మలే రియా, 10 చికన్‌గున్యా జ్వరాలు నమోదయ్యాయన్నారు. ప్రస్తుతం డెంగ్యూ కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమకాటుతో జ్వరాల బారిన పడకుండా దాతలు అందజేసే దోమ తెరలు పంపిణీ చేసేం దుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇమ్యూనిటీ అధికారి దేవి, డాక్టర్ గాయత్రి ఉన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

ముదినేపల్లి, ఆగస్టు 23 : ఏపీటీఎఫ్ ముదినేపల్లి మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. శుక్రవారం ముదినేపల్లిలో నిర్వహించిన సమాఖ్య సర్వసభ్య సమావేశంలో మండల అధ్యక్షుడిగా ఎ.కృపాకర్, ప్రధాన కార్యదర్శిగా డి.వెంకటరత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నలుగురు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, 8 మంది జిల్లా కౌన్సిలర్లు, మరి కొందరు కార్యవర్గ సభ్యులు ఉన్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఉపాధ్యాయులు సుందర్, వర్మ, నాగమల్లేశ్వరరావు వ్యవహరించారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్, నాయకులు జాన్సన్ బాబు, సీపీఎల్ నరసింహారావు, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

టీడీపీ సీనియర్ నేత దుక్కిపాటి మృతి



ముదినేపల్లి, ఆగస్టు 23 : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ముదినేపల్లి మండలం చినపాలపర్రు గ్రామ ప్రముఖుడు దుక్కిపాటి శేషగిరిరావు (80) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. 1983 నుంచి ఆయన టీడీపీలో మండల స్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించారు. గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధితోపాటు పదవి లేకున్నా గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నాయకులు కొడాలి వినోద్, కోడూరు శేషుబాబు తదితరులు శేషగిరిరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి ఆయన కుమారులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బాలిక అంత్యక్రియలకు వైష్ణవి చేయూత

ముదినేపల్లి, ఆగస్టు 23 : ముదినేపల్లి మండలం సంకర్షణపురంలో బ్రెయిన్ క్యాన్సర్‌తో కరవళ్ల సంధ్య (14) అనే బాలిక శుక్రవారం మృతి చెందింది. కొంతకాలంగా ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ ఫలితం లేక ఆ బాలిక మరణించింది. తమ ఏకైక కుమార్తె చనిపోవటంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. నిరుపేద కుటుంబం కావటంతో ఆ బాలిక అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.5 వేల సహాయం అందజేశారు. వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ తదితరులు సంధ్య తల్లిదండ్రులను ఓదార్చారు.

ఒక్కటైన ప్రేమ జంట

ముదినేపల్లి, ఆగస్టు 23 : ప్రేమ జంట వివాహం చేసుకుని రక్షణ కోరుతూ శుక్రవారం ముదినేపల్లి పోలీసులను ఆశ్రయించారు. సింగరాయపాలేనికి చెందిన బూరుబోయిన వెంకట సత్యనారాయణ, అదే గ్రామానికి చెందిన నవ్య ఏడాది కాలంగా ప్రేమించు కుంటున్నారు. నవ్య కుటుంబీకులు వివాహానికి అంగీకరించకపోవడంతో గురువారం ప్రేమజంట విజయవాడ వెళ్లి దుర్గమ్మ ఆలయంలో వివాహం చేసుకున్నారు. శుక్రవారం ఇద్దరూ ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి తాము మేజర్లమైనందున తమ ఇష్ట ప్రకారమే వివాహం చేసుకున్నామని రాత పూర్వకం గా తెలిపారు. అనంతరం సింగరాయపాలెంలో సత్యనారాయణ ఇంటికి వెళ్లిపోయారు.

తపాలా స్టాంపుల సేకరణపై పోటీ పరీక్ష

ఏలూరు అర్బన్, ఆగస్టు 23: తపాలా స్టాంపుల సేకరణపై విద్యార్థులకు అవగాహనలో భాగంగా దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన-2024 ఫిలాటలి (సేకరణ)లో పోటీ పరీక్ష నిర్వహించి స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు ఏలూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్‌బాబు శుక్రవారం తెలిపారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతీ తరగతి నుంచి పదిమంది విద్యార్థులను ఎంపికచేసి నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6వేలు ఉపకార వేతనం అందజేస్తామన్నారు. సెప్టెంబరు 30న ప్రాంతీయ స్థాయి పోటీ పరీక్ష, రెండో విభాగంలో ఫిలాటలీ ప్రాజెక్ట్ పరీక్ష నిర్వహిస్తారని వివరించారు.

డైట్ చార్జీల మంజూరుకు చర్యలు

జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాణి ● 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



ముదినేపల్లి, ఆగస్టు 23 : ప్రభుత్వం బీసీ సంక్షేమశాఖ వసతి గృహాల్లో విద్యార్థులకు డైట్ చార్జీల బడ్జెట్ విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏలూరు జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారిణి ఆర్.వి.నాగరాణి తెలిపారు. ప్రభుత్వం నుంచి డైట్ చార్జీలు రాక వసతిగృహాల వెల్ఫేర్ ఆఫీసర్లు అప్పుల పాలవుతున్న వైనంపై 'సార్ రూ.2 వేలు సర్దండి' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు ఆమె స్పందిస్తూ వివరణ ఇచ్చారు. శుక్రవారం ముదినేపల్లి వచ్చిన ఆమె 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి బీసీ వెల్ఫేర్ హాస్టళ్ల విద్యార్థులకు డైట్ చార్జీలు రావాల్సి ఉందని, త్వరితగతిన డైట్ చార్జీల బడ్జెట్ విడుదలకు, వార్డెన్ల ఇబ్బందులపై ఉన్నతాధికారులతో మాట్లాడతామని తెలిపారు. జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నాగమణి శుక్రవారం ముదినేపల్లిలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేశారు. సౌకర్యాలపై హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.సురేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కోసం, హాస్టల్ భవనం మరమ్మతులకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

నూజివీడు డివిజన్‌లో 115 మీ.మీ. వర్షపాతం

నూజివీడుటౌన్, ఆగస్టు 23: నూజివీడు డివిజన్ వ్యాప్తంగా 115 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆగిరిపల్లి మండలంలోని 25.8 మి.మీ., లింగపాలెం 26.4, నూజివీడు 24.6, ముసునూరు 22, చింతలపూడి 8, చాట్రాయి 8.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా మొత్తం వర్షపాతం 115.4 మిల్లీమీటర్లు, సరాసరి వర్షపాతం 19.2గా నమోదైంది.

ట్రిపుల్ ఐటీలో ఘనంగా అంతరిక్ష దినోత్సవం

నూజివీడు టౌన్, ఆగస్టు 23: నూజివీడు ట్రిపుల్ ఐటీ ఈసీఈ విభాగంలో ఏరో డైనమిక్ క్లబ్ శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయాన్ - 3 ద్వారా ప్రేరణ పొంది చంద్రుని ఉపరితలంపై ఉన్న పరిస్థితులను వివరిస్తూ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించి చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతంలో చంద్రయాన్ దిగిన విధానాన్ని వివరించారు. ట్రిపుల్ ఐటీ ఏవో లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ ఎన్.రత్నాకర్, ఈసీఈ హెచ్‌వోడీ పి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను సీలింగ్ పరిధిని పెంచాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 23: వేతనంపై ఆధారపడిన వారి ఆదాయ పన్ను సీలింగ్ పరిధిని రెట్టింపు చేయాలని ఏఐటీయుసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో నిర్వహించనున్న ఏఐటీయుసీ జనరల్ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరుతూ నూజివీడు అమర్‌భవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, సామాజిక పింఛన్‌ను రూ.9 వేలు చేయాలని, ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయుసీ నియోజకవర్గ అధ్యక్షుడు అక్కినేని రాజ, ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమమే కూటమి ధ్యేయం : మంత్రి

నూజివీడు/ముసునూరు, ఆగస్టు 23: ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖమంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం నూజివీడు మండలం బోర్వంచ గ్రామంలో మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సారథి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నూజివీడులో త్వరలో షాదీఖానా నిర్మాణానికి తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ముస్లిం పెద్దలు మాట్లాడుతూ అనాథ పిల్లలకోసం నిర్వహిస్తున్న పాఠశాలకు నిధులు కేటాయించాలని కోరారు. స్థానిక జనసేన నాయకులు బర్మా ఫణిబాబు, దారుల్ ఉలూమ్ మహ్మదీయ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. ముసునూరు మండలంలోని గోపవరంలో గ్రామదేవత శ్రీ గంగమ్మ వారికి మంత్రి పార్థసారథి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని గ్రామస్థుల ఆహ్వానం మేరకు విచ్చేసిన మంత్రికి మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. అన్నదాన కార్యక్రమానికి మంత్రి ఆర్థిక సాయం అందించారు.

పెండ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేత

చాట్రాయి, ఆగస్టు 23: మండలంలోని తుమ్మగూడెం పాల సహకార సంఘానికి పాలు పోస్తున్న మందలపు సీతారామయ్య కుమారుడు తిరుపతిరావు వివాహం సందర్భంగా, కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద రూ. 20 వేలు విలువైన బంగారు నాణేన్ని శుక్రవారం తిరువూరు క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి, సంఘం అధ్యక్షురాలు మందలపు పద్మావతి అందజేశారు. సూపర్‌వైజర్ శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

ముసునూరు, ఆగస్టు 23: బలివే, కొర్లకుంట, చింతలవల్లి గ్రామాల్లో ముసునూరు పీహెచ్‌సీ వైద్య అధికారిణి డాక్టర్ షకీనా ఇవాంజలి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఎమ్.ఎల్.హెచ్.పిలు 156 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, ఐదుగురు సాధారణ జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి వైద్య సేవలు అందించారు. హెల్త్‌సూపర్‌వైజర్ కె.మురళీమోహన్, పిహెచ్ఎన్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కృష్ణవరం, వడ్లమాను గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. వడ్లమానులో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. సగ్గూరులో వైద్యాధికారిణి డాక్టర్ మంజులదేవి వైద్యశిబిరం నిర్వహించి మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 09089

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234